ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com




సంపుటి-1 | సంచిక - 91 | మంగళవారం 30 డిసెంబర్ 2025 | పేజీలు - 8 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

## అత్యంత పవిత్రం

# ముక్కోటి ఏకాదశి



### వైకుంఠ ద్వారాలు తెరిచి ఉంచే రోజు...నేడు ముక్కోటి ఏకాదశి

**తిరుమల, డిసెంబర్ 29 :**

ఏడాదికి 24 ఏకాదశులు వస్తాయి. సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి అంటారు. సూర్యుడు ధనుస్సులో ప్రవేశించిన అనంతరం మకర సంక్రమణం వరకు జరిగే 'మార్గం' మధ్య ముక్కోటి ఏకాదశి వస్తుంది. ఈ రోజున వైకుంఠ వాకిళ్లు తెరుచుకొని ఉంటాయని వైష్ణవాలయాలలో గల ఉత్తర ద్వారం దగ్గర భక్తులు తెల్లవారుజామునే భగవద్దర్శనార్థం వేచి ఉంటారు. ఈ రోజు మహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడు కనుక దీనికి ముక్కోటి ఏకాదశి అనే పేరు వచ్చిందంటారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమమైన పవిత్రతను సంతరించుకున్నందువల్ల దీన్ని ముక్కోటి ఏకాదశి అంటారని కూడా చెబుతారు. ముక్కోటి ఏకాదశి నాడే హాలాహలం, అమృతం రెండూ పుట్టాయి. ఈ రోజునే శివుడు హాలాహలం మింగాడు. మహాభారత యుద్ధంలో భగవద్గీతను కృష్ణుడు అర్జునునికి ఇదే రోజున ఉపదేశించాడని విశ్వాసం ఉంది.ఈ రోజున వైష్ణవఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రవచనాలు, ప్రసంగాలు ఉంటాయి. ఈ రోజున ముఖ్యమైనవి ఉపవాసం, జాగరణ. అటు తర్వాత జపం, ధ్యానం.విష్ణుపురాణం ప్రకారం ఇద్దరు రాక్షసులు తనకు వ్యతిరేకంగా ఉన్నా మహావిష్ణువు వారి కోసం తన వైకుంఠ

మిగతా 2లో

# జిల్లాల మార్పులు

- జిల్లాల పునర్విభజనకు కేబినెట్ ఆమోదం..
- కొత్తగా మదనపల్లె, మార్కాపురం, రంపచోడవరం జిల్లాలు..
- రాష్ట్రంలోని 28కి పెరగనున్న జిల్లాల సంఖ్య..
- మదనపల్లె కొత్త జిల్లాలో రాయచోటి విలీనం..
- రాజంపేటను కడప జిల్లాకు కేటాయింపు..
- రైల్వే కోడూరును తిరుపతి జిల్లాకు కేటాయింపు..
- గూడూరును తిరుపతి నుంచి నెల్లూరులో విలీనం..
- రాయచోటి మార్పుపై కన్నీరు పెట్టుకున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి....



**అమరావతి, డిసెంబర్ 29 :**

జిల్లాల ఏర్పాటు, పునర్విభజనలపై ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాల పునర్విభజన ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రివర్గ నిర్ణయంతో కొత్తగా మదనపల్లె, మార్కాపురం, రంపచోడవరం జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో రాష్ట్రంలోని జిల్లాల సంఖ్య 28కి పెరగనుంది. దీనికి సంబంధించి తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. అన్నమయ్య జిల్లాలోని రాయచోటిని మదనపల్లె కొత్త జిల్లాకు, రాజంపేటను కడప జిల్లాకు, రైల్వే కోడూరును తిరుపతి జిల్లాకు, గూడూరును తిరుపతి జిల్లా నుంచి నెల్లూరులో కలిపే ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మరోవైపు కొత్తగా 5 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు మంత్రివర్గం (మిగతా 2లో)

## ప్రజాభీష్టం మేరకే

# జిల్లాల్లో మార్పులు, చేర్పులు

- 17 జిల్లాల్లో కొన్ని మార్పులు చేసినట్లు వెల్లడి..
- అన్ని ప్రాంతాలకూ సమన్యాయం..
- సాంఘిక సంక్షేమ శాఖలో రుణ గ్రహీతలకు ఉపశమనం
- ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు..
- రాజముద్రతో 21.8 లక్షల పాస్‌బుక్‌లు పంపిణీ ..
- కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రులు..



**అమరావతి, డిసెంబర్ 29 :**

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లాల ఏర్పాటులో మార్పులు, చేర్పులు చేసినట్లు మంత్రులు తెలిపారు.క్యాబినెట్‌లో 24 అంశాలను చర్చించి ఆమోదం తెలిపినట్లు ఆంధ్రప్రదేశ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలను మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్‌తో కలిసి అనగాని వెల్లడించారు. సాంఘిక సంక్షేమ శాఖలో రుణాలు తీసుకున్న వారికి ఉపశమనం కల్పించామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆమోదించామన్నారు. 9 జిల్లాల్లో మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదని.. 17 జిల్లాల్లో కొన్ని మార్పులు చేసినట్లు వెల్లడించారు. ప్రజల కోరిక మేరకు డివిజన్లు, మండలాలు మార్చామన్నారు. గత ప్రభుత్వం సరిగా ఆలోచించకుండా (మిగతా 2లో)

## వైకుంఠ ఏకాదశికి తిరుమలలో

# భారీ ఏర్పాట్లు



**తిరుమల, డిసెంబర్ 29 :**

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని తిరుమలలో ఉత్తర ద్వార దర్శనానికి తితిదే విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. వేకువజామునే వివిఐపిల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా తిరుమలకు రానున్నారు. ఈ నేపథ్యంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. తితిదే సీవీఎస్వో, జిల్లా ఎస్పీ, చీఫ్ ఇంజినీర్, పలు విభాగాల అధికారులు బీఆర్ నాయుడు వెంట ఉన్నారు. శిలాతోరణం, కృష్ణతేజ, ఏటీజీహెచ్ క్యూలైన్ ఎంట్రీ పాయింట్స్ వద్ద క్షేత్రస్థాయిలో సదుపాయాలను వారు పరిశీలించారు. వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి డిసెంబర్ 30, 31, జనవరి 1తేదీల్లో 1.89 లక్షల టోకెన్లను ఈ-డిప్ (మిగతా 2లో)

# వరల్డ్ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్

- సత్తా చాటిన కోనేరు హంపి, అర్జున్ ఎరిగైసి
- ఎక్స్ వేదికగా అభినందించిన సిఎం చంద్రబాబు



**అమరావతి, డిసెంబర్ 29 :**

ఎఫ్ఐడీఈ వరల్డ్ రాపిడ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన చెస్ క్రీడాకారులు కోనేరు హంపి, అర్జున్ ఎరిగైసి తమ సత్తా చాటారు. ఈ పోటీల్లో వీరు కాంస్య పతకాలను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా వీరికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలియజేశారు. తన ఎక్స్ ఖాతా వేదికగా వీరిద్దరికి వేర్వేరుగా ఆయన అభినందనలు తెలిపారు. ఎఫ్ఐడీఈ వరల్డ్ రాపిడ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలుచుకున్న కోనేరు హంపికి అభినందనలు చెప్పారు. ఒక ఫలితంతో ఛాంపియన్‌లను (మిగతా 2లో)

# తగ్గిన క్రైమ్ రేటు

- మహిళల రక్షణకు పెద్దపీట..
- మత్తు పదార్థాల రవాణా, సెల్‌ఫోన్ల రికవరీలో పురోగతి..
- సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల అదుపునకు కృషి..
- 2025 వార్షిక నేర నివేదిక విడుదలలో డిజిపి హరీష్ కుమార్ గుప్తా



**అమరావతి, డిసెంబర్ 29 :**

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏపీలో క్రైం రేటు బాగా తగ్గిందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. పోలీస్ శాఖ తీసుకున్న నిర్ణయాల వల్ల నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. 2025 సంవత్సరానికి గాను వార్షిక నేర నివేదికను సోమవారం ఏపీ డీజీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. మహిళలకు రక్షణ, మత్తు పదార్థాల రవాణా, సెల్‌ఫోన్ల రికవరీ వంటి అనేక వాటిలో మంచి పురోగతి సాధించామని చెప్పుకొచ్చారు. నిరంతరం సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఈ నేరాలను మరింత తగ్గించేలా నూతన ఏడాదిలో పోలీసులు పని చేస్తారన్నారు. వచ్చే పదేళ్లల్లో పోలీసింగ్ ఎలా ఉంటుందనే దానిపై వర్క్‌షాపు నిర్వహిస్తున్నామని అన్నారు. (మిగతా 2లో)

# మామిడి తోటల బీమా ఏదీ

- 4 వేల మంది రైతులకి పైగా ఇన్సూరెన్స్ చెల్లింపు..
- హెక్టారుకు రూ 4500లు చెల్లింపులు జరిగాయి..
- ఉలుకుపలుకూ లేని ఇన్సూరెన్స్ కంపెనీ..
- రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించకనే బీమా ఇవ్వడం లేదన్న ఇన్సూరెన్స్ సంస్థ..
- కృషి విజ్ఞాన కేంద్రానికి స్థలం కేటాయింపు ఏదీ..
- జగన్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు..
- రైతన్నల బాగోగులూ పట్టించుకోండి..
- శ్రీ సత్యసాయి జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి ఆవుటాల..



**పుట్టపర్తి, డిసెంబర్ 30 :**

శ్రీసత్యసాయి జిల్లాలో మామిడి తోటల రైతన్నలు తోటలపై చేయించిన ఇన్సూరెన్స్ పై పట్టించుకునే నాథుడే కరువయ్యారని జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి ఆవుటాల రమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా వ్యాప్తంగా మామిడి తోటల రైతన్నలకు బీమా డబ్బులు వచ్చే విధంగా చర్యలు చేబట్టాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేబట్టాలని ఆదేశించారు. అనంతరం ఆవుటాల రమణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో సుమారు 4వేల మందికి పైగా మామిడి తోటల రైతన్నలు అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ అనే కేంద్రప్రభుత్వ బీమా సంస్థకు హెక్టారుకు రూ 4500లు చెల్లించారని తెలపారు. జిల్లాలో 48,175 ఎకరాల్లో మామిడి తోటల సాగు వుందన్నారు. పంట దిగుబడి రాకపోయినా ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లిస్తే పరిహారం అందుతుందన్న ఆశతో చెల్లించారన్నారు. ఈ విషయంపై సంబంధిత కంపెనీ (మిగతా 2లో)

## ఆరావళిపై ఇచ్చిన

# ఉత్తర్వులపై సుప్రీం స్టే

- కొత్తకమిటీతో ఆరావళిపై అధ్యయనానికి ఆదేశం



**న్యూ ఢిల్లీ, డిసెంబర్ 29 :**

ఆరావళి పర్వత శ్రేణుల్లో మైనింగ్ వివాదంపై సిజెఐ జస్టిస్ సూర్యకాంత నేతృత్వంలో సోమవారం విచారణ సందర్భంగా కీలక నిర్ణయం ప్రకటించింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కు తీసుకుంది. ఇటీవల ఆరావళి కొండలకు ఆమోదించిన నిర్వచనాలకు సంబంధించిన కొన్ని వివరణలు అవసరమని సుప్రీం కోర్టు సోమవారం పేర్కొంది, అదే సమయంలో ఈ అంశంపై గత నెలలో జారీ చేసిన తీర్పుపై స్టే విధించింది. గతంలో అధికారులతో కూడిన (మిగతా 2లో)

# వైకుంఠ ఏకాదశి

(మొదటి పేజి (తరువాయి)

ద్వారాలను తెరిచాడనీ, తమ కథ విని, వైకుంఠ ద్వారం గుండా వస్తున్న విష్ణు స్వరూపాన్ని చూసిన వారికి వైకుంఠం ప్రవేశం కల్పించాలనీ వారు కోరారు. అందుజేతనే ఆ రోజును వైకుంఠ ద్వారాన్ని తలపించే విధంగా వైష్ణవ ఆలయాల్లో ద్వారాలను ఏర్పాటు చేస్తారు. మామూలు రోజుల్లో దేవాలయాల ఉత్తర ద్వారాలు మూసి ఉంచుతారు. కానీ ఈ రోజు భక్తులు ఆ ఉత్తరద్వారం గుండా వెళ్ళి దర్శనం చేసుకొంటారు. తిరుపతిలో కూడా ఈ రోజును వైకుంఠద్వారం పేరిట ఉన్న ప్రత్యేక ద్వారాన్ని తెరిచి ఉంచుతారు. పద్మ పురాణం ప్రకారం విష్ణువునుంచి ఉద్భవించిన శక్తి ముర అనే రాక్షసుడిని సంహరించిన రోజు వైకుంఠ ఏకాదశి. ముర అనే రాక్షసుడి దురాగతాలు భరించలేక దేవతలు విష్ణువు శరణువేడగా ఆయన వాడితో తలపడి వాడిని సంహరించేందుకు ప్రత్యేక అస్త్రం కావాలని గ్రహించి బదరికాశ్రమంలోని హైమావతి గుహలోకి ప్రవేశించాడు. అక్కడ విశ్రమిస్తున్న విష్ణువును ముర సంహరించేందుకు ప్రయత్నించగా ఆయన నుంచి ఒక శక్తి ఉద్భవించి తన కంటి చూపుతో మురను కాల్చి వేసింది. అప్పుడు విష్ణువు సంతసించి ఆమెకు ఏకాదశి అని పేరు పెట్టి వరం కోరుకోమని చెప్పాడు. ఆ రోజున ఉపవాసం ఉన్న వారి పాపాలను పరిహరించాలని ఆమె కోరింది. ధనుర్మాస శుక్ల ఏకాదశి రోజున ఉపవాసం ఉన్న వారికి వైకుంఠప్రాప్తి కలుగుతుందని విష్ణువు వరమిచ్చాడు. వైకుంఠ ఏకాదశి రోజు ముర బియ్యంలో దాక్కుంటాడని, అందుకే బియ్యంతో చేసిన ఏ పదార్థం తినకుండా ఉండాలని అంటారు. ఈ రోజున ఉపవాసం ఉంటే మిగతా 23 ఏకాదశులు ఉపవాసం ఉన్నట్టే అని విష్ణుపురాణం చెబుతోంది. ముర అంటే తామసిక, రాజసిక గుణాలకు, అరిషడ్వర్గాలకు ప్రతీక. వీటిని ఉపవాస జాగరణల ద్వారా జయిస్తే సత్వ గుణం లభించి తద్వారా ముక్తికి మార్గం ఏర్పడుతుంది. వరి అన్నంలో ముర నివాసం ఉంటాడు కనుక మందబుద్ధిని ఇచ్చిని జాగురూకతను దెబ్బతీస్తాడని అంతరార్థం.ఏకాదశినాడు ఉపవాసం ఉండి, ద్వాదశినాడు అన్న దానం చేస్తారు. ఒకరోజు భోజనం చేయక తరువాతి రోజు చేయడం వలన జిహ్వాకు భోజనం రుచి తెలుస్తుంది. గీతోపదేశం జరిగిన రోజు కనుక 'భగవద్గీత' పుస్తకదానం చేస్తారు.

# మామిడి తోటల బీమా ఏదీ

(మొదటి పేజి (తరువాయి)

కంపెనీ ప్రతినిధులను ప్రశ్నించగా రైతన్నల వాటాతో పాటు కేంద్ర ప్రభుత్వ వాటా తమకు అందిందని, అయితే రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించకపోవడంతో తామేమీ చేయలేకున్నామని తెలిపారన్నారు. అదేవిధంగా వాతావరణానికి సంబంధించిన డేటా తమకు ఇంతవరకు ఇవ్వలేదనీ దీంతో పరిహారం చెల్లింపుపై సరైన నిర్ణయం తీసుకోలేకున్నామని అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు సమాధానమిచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా జిల్లాలోని కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు ప్రతిక్షణం జగన్‌ను తిట్టేందుకే సమయం వెచ్చిస్తున్నారని ఎద్దేవా చేశారు. మామిడి తోటలున్న రైతన్నల్లో కేవలం వైసీపీ మద్దతు దారులు మాత్రమే బీమా మొత్తాన్ని చెల్లించారేమో అనుకుని పట్టించుకోకపోతే పొరపాటేనన్నారు. టీడీపీ మద్దతు దారులైన రైతన్నలు కూడా తమ మామిడి తోటలకు ఇన్సూరెన్స్ మొత్తాన్ని చెల్లించారని ఈవిషయాన్ని కూటమి నాయకులు గుర్తించాలన్నారు. జిల్లాలో రైతాంగంపట్ల ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్తున్న నాయకులు మామిడి తోటల బీమాపై పట్టించుకోవడం శోచనీయమన్నారు. జిల్లాలో రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. జిల్లాకు కృషి విజ్ఞాన కేంద్రం వస్తుందని, అందుకు సంబంధించి 50నుండి 60 ఎకరాల భూమిని చూయించాలని తాను 6మాసాల క్రితమే జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తే వారు ఆ వినతిని వ్యవసాయ శాఖ అధికారులకు అప్పజెప్పారనీ, వారు ఇది తమ పరిధిలోకి రాదని 6మాసాల తర్వాత తనకు ఉత్తర్వు పంపడం గమనార్హమన్నారు. దీన్నిబట్టి చూస్తే జిల్లాలో వ్యవసాయ రంగ అభివృద్ధి పట్ల కూటమి నాయకులకు, అధికారులకు ఎంతమాత్రం చిత్తశుద్ధి వుందో తెలుస్తోందన్నారు. జిల్లాలో ఎవరు ఏపార్టీవారైనా సరే రైతన్నల్లో పార్టీలు చూడకుండా వ్యవసాయరంగ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. మున్సిపల్ ఛైర్మెన్ తుంగ ఓబుళపతి, మాజీ రూరల్ కన్వీనర్ గంగాధర్, బుక్కపట్నం మండల ఉపాధ్యక్షులు రంగారెడ్డి, రాఘవరెడ్డి, వెంకటరెడ్డి, క్రిష్ణారెడ్డి, మాధవరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, పలువురు రైతన్నలు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినవారిలో వున్నారు.

# జిల్లాల్లో మార్పులు చేర్పులు



(మొదటి పేజి (తరువాయి)

జిల్లాల విభజన చేసిందని విమర్శించారు. గతంలో పారదర్శకంగా చేసుంటే ఈ సమస్యలు వచ్చేవి కావని మంత్రులు నాదెండ్ల, సత్యకుమార్ వ్యాఖ్యానించారు. గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలు ఉన్నాయి. గ్రేటర్ సిటీలుగా అభివృద్ధి చేస్తామని సీఎం అన్నారు. రాజముద్రతో 21.8 లక్షల పాస్‌బుక్‌లు పంపిణీ చేస్తున్నాం. జనవరి 9లోగా పాస్‌బుక్‌ల పంపిణీ పూర్తి చేస్తాం. తప్పులు సరిచేశాకే పాస్‌బుక్‌లు ఇవ్వాలని ఆదేశించాం. పాస్‌బుక్‌లపై గత పాలకుల ఫొటోలు తొలగించాం. పోలవరం పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. రాయచోటిని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం హామీ ఇచ్చారు. మంత్రి మండిపల్లిని పిలిచి సీఎం చంద్రబాబు ఓదార్చారు. పరిపాలనా సౌలభ్యం కోసం నిర్ణయాలు తీసుకున్నాం అని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి మార్పుపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురవడం చర్చనీయాంశంగా మారింది. వెంటనే రంగంలోకి దిగిన సీఎం చంద్రబాబు మంత్రితో మాట్లాడారు. అలాగే రాయచోటి నియోజకవర్గాన్ని జిల్లా స్థాయి అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇవ్వడం జరిగింది. రాయచోటి మార్పు వ్యహారంపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి చాలా బాధపడుతున్నారని తెలిపారు. అందుకే ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగి మంత్రిమండలి తరవాత కూడా రాంప్రసాద్ రెడ్డిని పిలిచారన్నారు. ఆయన్ను ఓదార్చినట్లు తెలిపారు. రాయచోటిని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని సీఎం చెప్పారని అన్నారు. ఆయనకు మెడికల్ కాలేజీ కావాలా?.. ఇంకేం ఏమన్నా కావాలా అన్న విషయాన్ని ప్రభుత్వం చూస్తుందని తెలిపారు. అలాగే రాంప్రసాద్ రెడ్డి రాజీనామా లాంటి హెవ్వీ డెసిషన్‌లాంటివి తీసుకోరన్నారు. ఆయనకు కూడా తమ ప్రాంత అభివృద్ధి ముఖ్యం అని భావిస్తారని మంత్రి స్పష్టం చేశారు. అన్నమయ్య ఎక్కడ జన్మించినా శ్రీవారి సేవలో ఉన్నారని తెలిపారు. అన్నమయ్యకు ప్రాంతాలు ఉండవని... గతంలో కూడా కృష్ణా జిల్లాలో ఎన్టీఆర్ జన్మిస్తే ఎన్టీఆర్ జిల్లా ఏర్పాటు చేసి పెట్టారని మంత్రి అనగాని గుర్తుచేశారు. పరిపాలనా సౌలభ్యం కోసమే రాయచోటి నుంచి మదనపల్లికి మార్చారని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కూటమి కేంద్రం సహకారంతో ప్రభుత్వంలో చేస్తున్న అనేక కార్యక్రమాలను కేబినెట్ చివరన సీఎం తెలిపారన్నారు. అభివృద్ధి, సంక్షమం కింద రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచామని, రూ.50 వేల కోట్లు పెన్షన్ల కింద పంపిణీ చేశామని అన్నారు. సూపర్ సిక్స్ చాలా బాగా సక్సెస్ చేయగలిగామని.... ఆర్థిక ఇబ్బందులున్నా దీన్ని అధిగమించగలిగామని తెలిపారు. ప్రతి గ్రామంలో పల్లె పండుగ తెచ్చి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయితీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేశారన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పెట్టుబడి గూగుల్ విశాఖకు రావడం ఏపీకి గర్వకారణమన్నారు. గంజాయిపై తాము చేసిన యుద్ధం గురించి కూడా సీఎం కేబినెట్‌లో ప్రస్తావించారని తెలిపారు. రాయలసీమలో తిరుపతిని ఇండస్ట్రియల్ హబ్‌గా, నెల్లూరు పోర్టును ఉపయోగించుకొని 2026లో ముందుకు వెళితే స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా ముందుకు వెళాతామన్నారు. పట్టుదలతో , అంకిత భావంతో బాధ్యతగా పనిచేద్దామని ముఖ్యమంత్రి చెప్పారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ప్రభుత్వపరంగా చాలా కార్యక్రమాలను అమలు చేశాం. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి దిగ్విజయంగా చేసిన పనులు గురించి చర్చించాం. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 50 వేల కోట్ల వరకూ ఎన్టీఆర్ భరోసా పేరిట పింఛన్లు అందించాం. సచివాలయాల విషయంలోనూ చాలా మార్పులు చేశాం. ఇప్పటి వరకు రూ. 1200 కోట్లు వెచ్చించి రోడ్లను వేశాం. రూ. 2,500 కోట్లు మంజూరు చేసి రోడ్లను మరమ్మతు చేయిస్తున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రతి గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం తీసుకొచ్చారు. విశాఖలో పెద్ద ఎత్తున పెట్టుబడులను సీఎం చంద్రబాబు నాయకత్వంలో తీసుకొచ్చాం. ఐటీ సేవలను మరింత విస్తృతం చేసి అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశాం. పోలీసు శాఖను బలోపేతం చేశాం. గ్రామ, వార్డు సచివాలయాలను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుగా మారుస్తున్నాం' అని మనోహర్ తెలిపారు. ఆర్థిక సమస్యలు ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం ముందుకెళు తున్నాం. గతంలో జరిగిన విధ్వంసకర చర్యలను సరి చేస్తున్నాం. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించే దిశగా అనేక కార్యక్రమాలు చేపట్టాం. మౌలిక వసతుల కోసం దాదాపు రూ. 3 లక్షల కోట్లను ఖర్చు చేస్తున్నాం. కొప్పర్తి, ఓర్వకల్లుకు పెట్టుబడులు భారీగా వస్తున్నాయి. మచిలీపట్నం నుంచి హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ వరకు రోడ్డు వెళ్తుంది. కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోంది. గత ప్రభుత్వం మాదిరిగా పథకాలకు తమ పేర్లను కాకుండా.. మహనీయుల పేర్లను పెడుతున్నాం. దీనిపైనా మంత్రివర్గం లో చర్చ జరిగిందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రధానంగా విశాఖలో ఆసుపత్రి నిర్మాణానికి భూమి కేటాయింపు, పెనుగొండను వాసవీ పెనుగొండగా మార్చేందుకు ఆమోదం లభించింది. మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం కలిపి జిల్లా ఏర్పాటు చేయనున్నారు.బనగానపల్లె, అద్దరోడ్డును డివిజన్లగా ఏర్పాటు చేస్తారు. చేర్పులు, మార్పులన్నీ జనవరి 1 నుంచి అమల్లోకి వస్తాయి. అన్నమయ్య జిల్లా పేరు అలాగే ఉంటుంది.. జిల్లా కేంద్రం మాత్రం మదనపల్లెకు మారుతుంది. అద్దంకి నియోజకవర్గం బాపట్ల జిల్లా నుంచి ప్రకాశం జిల్లాకు మార్పు చేశారు. ప్రకాశం జిల్లాలో అద్దంకి సబ్‌డివిజన్‌లోనే దర్శి నియోజకవర్గం ఉంటుంది. రాజంపేటను కడప జిల్లాలో, రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలోకి, కడపలోకి సిద్ధవటం, ఒంటిమిట్ట మార్పు చేయగా, ప్రత్యేక రెవెన్యూ డివిజన్‌గా మడకశిరను ఏర్పాటు చేయనున్నారు.

# జిల్లాల మార్పులు



(మొదటి పేజి (తరువాయి)

ఆమోదం తెలిపింది. ఏపీ క్యాబినెట్ సమావేశంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటి మార్పుపై ప్రతిపాదనలు ఉన్న నేపథ్యంలో ఆయన కన్నీరు పెట్టుకున్నారు. మంత్రి రాంప్రసాద్‌ను సీఎం చంద్రబాబు ఓదార్చారు. జిల్లా కేంద్రం మార్చకుంటే తలెత్తే సాంకేతికపరమైన ఇబ్బందులను మంత్రికి ఆయన వివరించారు. రాయచోటి అభివృద్ధి విషయాన్ని తాను చూసుకుంటానని చంద్రబాబు ఇచ్చారు. రాంప్రసాద్‌రెడ్డి ప్రస్తుతం రాయచోటి నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతంలో సాంకేతిక అంశాలను పక్కన పెట్టి జిల్లాల పునర్విభజనను గత వైసీపీ ప్రభుత్వం చేపట్టడం వల్ల పలు సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని పరిష్కరించేందుకు చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి మార్పుపై స్థానికలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంగా రాయచోటినే ఉంచాలంటూ ఆందోళనలు, నిరసనలకు దిగారు. ముఖ్యంగా ఈ అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి మార్పుపై మంత్రి రాం ప్రసాద్ రెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. దాంతో ఈ సమావేశంలో కొద్ది సేపు నిశబ్దం ఆవరించింది. జిల్లా కేంద్రం మార్చకుంటే ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను మంత్రి రాం ప్రసాద్‌కు సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు. రాయచోటి అభివృద్ధిని తాను చూసుకుంటానంటూ మంత్రి రాం ప్రసాద్ రెడ్డికి సీఎ చంద్రబాబు హామీ ఇచ్చారు. అనంతరం అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితోపాటు రాం ప్రసాద్ రెడ్డి కేబినెట్ నుంచి బయటకు వచ్చారు. కానీ మీడియా ప్రతినిధులతో మాట్లాడకుండానే రాం ప్రసాద్ రెడ్డి బయటకు వెళ్లిపోయారు.

# ఉత్తర్వులపై సుప్రీం స్టే

(మొదటి పేజి (తరువాయి)

కమిటీ చేసిన సిఫార్సుల పర్యావరణ ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తామని కోర్టు పేర్కొంది. ఆరావళి కొండల నిర్వచనంపై దాఖలైన సమస్యపై సుమోటో కేసులో కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 100 మీటర్లలోపు ఎత్తు ఉన్న ఆరావళి పర్వతాల వద్ద మైనింగ్‌కు గతంలో అనుమతులు ఇచ్చింది సుప్రీంకోర్టు. తాజాగా గతంలో ఇచ్చిన ఆదేశాలపై స్టే విధిస్తూ నేడు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణపరంగా పలు రాష్ట్రాలకు రక్షణ కవచంగా ఉన్న ఆరావళి పర్వతాలపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిర్వచనానికి సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అయితే ఈ కొత్త నిర్వచనం జాతీయస్థాయిలో దుమారం రేపుతోంది. ఈ క్రమంలో తాజాగా సుప్రీంకోర్టు స్పందించింది. గత నెల తాను ఇచ్చిన ఆదేశాలను సోమవారం నిలిపివేసింది. 'కోర్టు ఆదేశాలు, కమిటీ సిఫార్సులు నిలిపివేయడం అవసరమని మేం భావిస్తున్నాం. కొత్త కమిటీ ఏర్పాటయ్యేవరకు ఈ స్టే అమల్లో ఉంటుంది' అని ధర్మాసనం పేర్కొంది. కొత్త నిపుణుల బృందాన్ని ఏర్పాటుచేయాలని ఆదేశించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం, సంబంధిత రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరి 21కి వాయిదా వేసింది.దేశంలోనే అతిపురాతన పర్వతశ్రేణి ఆరావళి. ఇక్కడ అక్రమంగా పొందిన అనుమతులతో అడ్డగోలుగా మైనింగ్ జరుగుతోందని ఎప్పటినుంచో ఆందోళన ఉంది. ఇలాంటి సమయంలో 100 మీటర్లు... అంటే 328 అడుగుల కంటే ఎక్కువ ఎత్తున్నవి మాత్రమే పర్వతాలంటూ కేంద్రం కొత్త నిర్వచనం చెప్పింది. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించింది. దీనివల్ల హరియాణా, రాజస్థాన్, గుజరాత్, ఢిల్లీకి ముప్పు తప్పదని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరావళి పర్వత శ్రేణులు ఉన్న రాష్ట్రాలు కొత్తగా మైనింగ్ లీజులేవీ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిషేధం విధించింది. గుజరాత్ నుంచి జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) వరకూ విస్తరించి ఉన్న ఆరావళి పర్వత శ్రేణుల సమగ్రతను పరిరక్షించేందుకు, గనుల అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్న సంగతి తెలిసిందే. విచారణ సందర్భంగా తాత్కాలిక దరఖాస్తుదారుల ప్రవర్తనపై సీజెఐ తీవ్ర అసంతృప్తి చెందారు. ఆరావళి పర్యతాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, పర్యావరణ ముప్పునకు పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కమిటీకి సూచించింది. ఈ కేసును జనవరి 21న వివరణాత్మకంగా విచారణ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

# సనాతన హిందూ ధర్మ పరిరక్షణ

## దారితప్పిన వాళ్లకు అఖండ-2 కనువిప్పు కావాలి

## బోయపాటితో కలసి మూవీని వీక్షించిన బండి సంజయ్



**హైదరాబాద్, డిసెంబర్ 29 :**

ప్రతి ఒక్క హిందువుతోపాటు ప్రతీ భారతీయుడు తప్పకుండా చూడాల్సిన సినిమా నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ -2 అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ధర్మాన్ని దారి తప్పిన వాళ్లకు ఈ సినిమా ఓ గుణపాఠమని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ దేశాన్ని పాలిస్తున్నారు కాబట్టే కరోనా వంటి మహమ్మారికి విరుగుడుగా వ్యాక్సిన్‌ను కనుగొని ప్రపంచానికి అందించగలిగామని తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీనుతో కలిసి 'అఖండ 2 –తాండవం' సినిమాను బండి సంజయ్ సోమవారం వీక్షించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాశ్, అధికార ప్రతినిధి జె.సంగప్ప, జిల్లా అధ్యక్షులు ఉమా మహేందర్‌తో సహా పలువురు బీజేపీ రాష్ట్ర నాయకులు బండి సంజయ్‌తో కలిసి ఈ సినిమాను చూశారు. అనంతరం బోయపాటితో కలిసి బండి సంజయ్ కుమార్ ప్రసంగించారు.'అఖండ– 2 సినిమా చూడటం చాలా సంతోషంగా ఉంది. సంచలనాలకు మారుపేరు బోయపాటి శ్రీను. సమాజానికి ఉపయోగపడే సినిమాలు తీస్తున్నారు. పరమేశ్వరుడు ఆవహించడంతో ఈ సినిమా చేసినట్లు ఉన్నారు. కమర్షియల్ హంగులకు అద్భుతమైన సందేశాన్ని ఇస్తూ తీసిన సినిమా. సనాతన ధర్మం గురించి సినిమా చేయాలంటే చాలా ధైర్యం ఉండాలి. ఈ దేశంపైన, సనాతన ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాలపై దాడులు జరుగుతున్నా తట్టుకుని నిలబడిదంటే... దానికి కారణం మనం నమ్ముకున్న సనాతన ధర్మమే. ఆ నిరంతర చరిత్రను అద్భుతంగా చూపించిన సినిమా అఖండ– 2. దేశ సరిహద్దులను సైనికులు రక్షిస్తే... ధర్మాన్ని సమాజం రక్షించుకోవాలి. అన్యాయం జరుగుతుంటే మౌనంగా ఉండటం కూడా తప్పే. అన్యాయాన్ని ఎదురించి సమాజాన్ని రక్షించేవారే గొప్ప. సనాతన ధర్మం గొప్పతనం వినడం కంటే అఖండ –2 తాండవం సినిమా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క హిందువుపై, భారతీయుడుపై ఉంది. మిగిలిన ఈ జీవితాన్ని ధర్మం, దేశం కోసం అర్పించాలని అఖండ–2 చెబుతోంది' అని బండి సంజయ్ ప్రశంసించారు.

'భారత్ ఎప్పటికీ ప్రపంచంలోనే శక్తివంతమైన దేశం. కోవిడ్ తరుణంలో ప్రపంచమంతా దిక్కులు చూస్తుంటే.... సనాతన ధర్మాన్ని రక్షించే యోధుడు ఈ దేశాన్ని పాలిస్తున్న సందర్భంలో కోవిడ్ వస్తే.. ఏ విధంగా ఎదుర్కొన్నారో, ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన దృశ్యాలను మనం కళ్లారా చూశాం. అంతటి యోధుడు నరేంద్రుడు భారత్‌ను పరిపాలిస్తున్నారు కాబట్టే వ్యాక్సిన్‌ను అందించగలిగాం. సైంటిస్టులను ప్రోత్సహించాం. కరోనా వ్యాక్సిన్ అందించిన భారత్ బయోటెక్ హైదరాబాద్‌లో ఉంది. ప్రధాని మోదీ స్వయంగా ఇక్కడికి వచ్చి వ్యాక్సిన్‌ను పరీక్షించారు' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

'అఖండ –2 తాండవం సినిమాను ప్రతి హిందువు, భారతీయుడు తప్పకుండా చూడాల్సిన సినిమా అన్నారు. 'సనాతన ధర్మాన్ని కాపాడేలా మరిన్ని సినిమాలు రావాలని బండి సంజయ్ సూచించారు.

# భారీ ఏర్పాట్లు



(మొదటి పేజి (తరువాయి)

ద్వారా తితిదే కేటాయించింది. టోకెన్లు ఉన్న భక్తులకే ఆ మూడు రోజుల్లో దర్శనం కల్పించనున్నారు. ఎంట్రీ పాయింట్స్ వద్ద టోకెన్ స్కానింగ్ పక్రియను ఛైర్మన్‌కు అధికారులు వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ తలెత్తకుండా క్యూలైన్ నిర్వహించాలని బీఆర్ నాయుడు అధికారులకు సూచించారు.

# తగ్గిన క్రైం రేటు

(మొదటి పేజి (తరువాయి)

పోలీసు విధుల్లో వచ్చిన మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం, ఎలా అందిపుచ్చుకోవాలో వివరిస్తామని తెలిపారు. సంక్రాంతి పండుగ తర్వాత ఈ వర్క్‌షాపు ఉంటుందని వెల్లడించారు. అలాగే ఇటీవల కీలక కేసులను కూడా ప్రస్తావిస్తూ.. ఎలా ఛేధించారో వివరిస్తామని తెలిపారు. సరికొత్త పోలీసింగ్ కనిపించేలా ఈ వర్క్‌షాపు ద్వారా అందరికీ తెలియచేస్తామన్నారు. అప్పా ఒక్కటే మనకు పెండింగ్‌లో ఉందని.. దానిపై త్వరలోనే ప్రకటన వస్తుందని తెలిపారు. చట్టానికి అందరూ సమానమే అని.. వ్యతిరేకంగా వెళ్లేవారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇందులో విజయం, అపజయం ఉండదని.. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవమే తమ విధి అని స్పష్టం చేశారు. సేఫ్ ఏరియా అనుకుని కొంతమంది నక్సలైట్లు ఏపీలోకి వచ్చారని.. కానీ ఎప్పటికప్పుడు తాము నిఘా ఉంచి వారందరినీ పట్టుకున్నామన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి చైనాలో పెద్ద గ్యాంగ్స్ ఉన్నాయని తెలిపారు. మోసం జరిగిన వెంటనే ఆ దేశానికి నగదు వెళ్లిపోతుందని చెప్పారు. అందుకే ఇటువంటి కేసులలో నగదు వాపస్ అనేది చాలా కష్టమైన పని అని తెలియజేశారు. ఇటువంటి మోసాల పట్ల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేంద్రం ఇచ్చిన నివేదిక ప్రకారం 36వ స్థానంలో ఏపీ ఉందనే వార్తలు వాస్తవం కాదని తేల్చిచెప్పారు. అది పాత సిస్టమ్ అని.. మన డేటాకు, వారి డేటాకు మధ్య ఉన్న తేడా వల్ల అలా వచ్చిందన్నారు. అప్పుడు వారి డ్యాష్ బోర్డులో తప్పు ఉందని తాము వారికి లేఖ రాశామని అన్నారు. ఇప్పుడు చూడండి.. డ్యాష్ బోర్డులో ఏపీ ఎక్కడ ఉందో తెలుస్తుందని తెలిపారు.

# వరల్డ్ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్

(మొదటి పేజి (తరువాయి)

నిర్వచించరని.. అత్యున్నత స్థాయిలో మళ్లీ మళ్లీ పోటీ పడే ధైర్యం ద్వారా నిర్వచించవచ్చునని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ వేదికపై కాంస్య పతకం సాధించడం ద్వారా నిజమైన ప్రతిభ ప్రతిబింబించిందన్నారు. స్థిరమైన మీ ప్రయాణం లక్షలాది మంది భారతీయులకు గర్వ కారణమే కాకుండా స్ఫూర్తిదాయకమని కోనేరు హంపీపై సీఎం చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. ఎఫ్ఐడీఈ వరల్డ్ రాపిడ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలుచుకున్న అర్జున్ ఎరిగైసికి సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. ప్రముఖ చెస్ ఛాంపియన్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథ్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన ఏకైక భారతీయ పురుష ఆటగాడు అర్జున్ ఎరిగైసి అని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ పుత్రుడైన అర్జున్ భారతదేశ విశిష్ట చెస్ వారసత్వానికి మరో గర్వకారణమైన అధ్యాయనానికి శ్రీకారం చుట్టారంటూ అర్జున్‌ను సీఎం చంద్రబాబు ప్రశంసించారు.

## కొండగట్టుకు రానున్న

# డిప్యూటీ సీఎం పవన్

## 3న డిప్యూటీ సీఎం షెడ్యూల్ ఖరారు

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



**జగిత్యాల, డిసెంబర్ 29 :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టును సందర్శించనున్నారు. జనవరి మూడో తేదీన డిప్యూటీ సీఎం కొండగట్టుకు రానున్నారు. ఈ సందర్భంగా ఆయన కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. తన పర్యటనలో భాగంగా కొండగట్టులో ఆలయ అభివృద్ధికి సంబంధించి కీలక కార్యక్రమాలను ఆయన చేపట్టనున్నారు. టీటీడీ నిధులతో సుమారు రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు ఆలయ మౌలిక వసతులు, భక్తుల సౌకర్యాలను మరింత మెరుగుపరచే దిశగా ఉండనున్నాయి. కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. గతంలో ఏపీ రాజకీయాలకు సంబంధించి ఎన్డీఏ కూటమి పార్టీలతో పొత్తు పెట్టుకుంటున్నట్లు పవన్ కల్యాణ్ ఇదే ఆలయం నుంచి ప్రకటన చేశారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ కొండగట్టు అంజన్న ఆలయానికి వస్తుండటంతో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఏపీలో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కొండగట్టుకు వచ్చి అంజన్న స్వామిని దర్శించుకోవడం పవన్ కల్యాణ్ విశేషంగా భావిస్తున్నారు. ఈ పర్యటన రాజకీయంగా, ఆధ్యాత్మికంగా కూడా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. పవన్ కల్యాణ్ రాకతో కొండగట్టు ప్రాంతంలో భక్తులు, ఆయన అభిమానుల భారీగా తరలి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న 6వ వార్డు కాలనీవాసులు

## సెల్ టవర్ నిర్మాణం ఆపాలి

**తాసిల్దార్ కు వినతి**

**కనేకల్, డిసెంబర్ 29 :**
తారక రామ్ నగర్ ప్రాంతంలోని నివాస స్థలంలో ప్రైవేట్ సంస్థ ఇండస్ టవర్ ప్రైవేట్ లిమిటెడ్ సెల్ టవర్ నిర్మాణం చేపట్టిందని ఈఆపనులను ఆపాలని ఆరో వార్డుకు చెందిన ప్రజలు తహసీల్దార్ బ్రహ్మయ్యకు సోమవారం వినతిపత్రం అందించారు. నివాస ప్రాంతంలో సెల్ టవర్ నిర్మాణం ఏర్పాటు చేయడం వల్ల రేడియేషన్ ప్రభావంతో ఆరోగ్య సమస్యలు తలతీయ అవకాశం ఉందని ముఖ్యంగా హెచ్ ఎల్ సి ప్రభుత్వ పాఠశాల సమీపంలో టవర్కు నిర్మాణం చేపట్టడంతో చిన్నారులపై ప్రతికూల ప్రభావం ఏర్పడే అవకాశం మరింత ఎక్కువ ఉంటుందన్నారు. సెల్ టవర్ నిర్మాణం తక్షణమే నిలుపుదల చేయాలని ఆరో వార్డు నివాసులైన గోపాల్ రెడ్డి, షేక్షావలి, ఎం ఎల్లమ్మ, తిమ్మప్ప, కవిట్ మాబు సాబ్, అబ్దుల్ రెహమాన్, కలేకుర్తి జయరాం రెడ్డి,పెద్ద దేవర రహంతుల్లా,అనిల్ రెడ్డి శివకుమార్ తదితరులు వినతిపత్రం అందించారు. ఈ టవర్ నిర్మాణం తక్షం నిలుపుద చేయాలన్నారు.

## రైతులపై దౌర్జన్యం చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదు...

**పుట్లూరు, ఎల్లనూరు, తాడిపత్రి మండలాల రైతులకు అండ..**
**మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి**



**తాడిపత్రి, డిసెంబర్ 29:**
తుంపెర డీప్ కట్ వద్ద అధికారుల అనుమతి లేకున్నా సోమవారం ధర్మవరం నాయకులు దౌర్జన్యంగా కాలువను తెంచి నీళ్లు మళ్లించారని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. రైతులపై దౌర్జన్యం చేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. పుట్లూరు, ఎల్లనూరు, తాడిపత్రి మండలాల రైతులకు అండగా నిలుస్తామన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పుట్లూరు, ఎల్లనూరు, తాడిపత్రి మండల రైతుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా తుంపెర డీప్ కట్ వద్దకు చేరుకుంటామన్నారు. పుట్లూరు మండలం, యల్లనూరు మండలం, తాడిపత్రి మండలంలోని రైతులు అందరూ తప్పకుండా హెచ్ ఎల్ సి కాలువ 72వ కిలోమీటర్ తుంపెర డీప్ కట్ వద్దకు ఈనెల 30న ఉదయం 11 గంటలకు చేరుకోవాలని జేసీ ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. తుంపెర డీప్ కట్ వద్ద ధర్మవరానికి చెందిన వ్యక్తులు వచ్చి దౌర్జన్యంగా, అధికారుల అనుమతి లేకున్నా కాలువను తెంచి వారు నీళ్లు దౌర్జన్యంగా తీసుకుపోవడం జరిగిందన్నారు. మన వైపు ఉన్నది రైతులే అటువైపు ఉన్నది కూడా రైతులే అయినప్పుడు సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోక పోగా దౌర్జన్యం చేయడం సమంజసం కాదన్నారు. ఇది ఖచ్చితంగా రైతుల మధ్య గొడవలు సృష్టించే విధంగా ఉందని, వారికి ఇప్పటికే దాదాపు మూడు నెలల నుంచి చిత్రావతి డ్యాం వరకు నీరు చేరడం జరిగిందన్నారు. అయినప్పటికీ వాళ్లు ఇక్కడికి వచ్చి దౌర్జన్యంగా మళ్ళీ నీళ్లు తీసుకు పోవాలని, మన కాలువను తెంపడం జరిగిందన్నారు. ఇప్పుడు కొత్తగా ఎక్కడి నుంచో వచ్చిన ధర్మవరం నాయకులు ఇక్కడకు వచ్చి దౌర్జన్యం చేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. పుట్లూరు, ఎల్లనూరు, తాడిపత్రి మండలాల రైతులు అందరూ తుంపెరడీప్ కట్ దగ్గరికి చేరుకోవాల్సిందిగా కోరారు.



హెచ్ఎల్‌సి షట్టర్ల వద్దర చెత్తాచెదారం,
జంతు కళేబరాలను తొలగిస్తున్న అధికారులు

ఈనాటి తెలుగోడు వార్తకు స్పందన ..

## కనేకల్ హెచ్ఎల్‌సిలో జంతు కళేబరాలు చెత్తాచెదారం తొలగించిన అధికారులు

**కనేకల్, డిసెంబర్ 29 :**
కనేకల్ హెచ్ఎల్‌సి సబ్ డివిజన్ పరిధిలోని రాంనగర్ ప్రాంతంలోని కాలువ షట్టర్ల వద్ద పేరుకుపోయిన జంతు కళేబరాలు చెత్తాచెదారాన్ని చెరువు సంఘం అధ్యక్షుడు బిటి రమేష్ ఆధ్వర్యంలో హెచ్ ఎల్ సి అధికారులు, పంచాయతీ కార్మికులు సోమవారం చెత్తాచెదారం తొలగించారు. ఆదివారం ఈనాటి తెలుగోడు పత్రికలో ప్రచురించిన కనేకల్ హెచ్ఎల్‌సి కాలువలో చెత్తాచెదారం జంతు అవశేషాలు వార్త ప్రచురితమైంది. ఈ వార్త చూసి వెంటనే స్పందించిన అధికారులు హుటాహుటిన సోమవారం ఉదయం చెత్తాచెదారం జంతు కళేబరాల అవశేషాలను తొలగించారు. దాదాపు గంటసేపు ఈ తొలగింపు కార్యక్రమంలో అధికారులు శ్రమించారు. జెసిబి సహాయంతో ఎట్టకేలకు చెత్త తొలగించడంతో ఆ ప్రాంత ప్రజలు ఆ దుర్గంధం నుంచి విముక్తులయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జంతు కళేబరాలతో,చెత్తాచెదారంతో ఈ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లి ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడినందుకు బాధగా ఉందని మరోసారి ఈ విధంగా జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు.



చెత్తాచెదారం తొలగించిన అనంతరం షట్టర్లు

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం దిశగా మెప్మా

## మహిళల ఆరోగ్యానికి సఖి సురక్ష కవచం

**తాడిపత్రి, డిసెంబర్ 29:**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం దిశగా మెప్మా ముందడుగు వేస్తుందని, మహిళల ఆరోగ్యానికి సఖిబి సురక్ష కవచంగా ఉందని మునిసిపల్ వైస్ చైర్మన్ షేక్షావలి పేర్కొన్నారు.
శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు దివాకర్ ఆడిటోరియం నందు మెప్మా ఆధ్వర్యంలో సోమవారం సఖిబిసురక్ష మహిళల ఆరోగ్యానికి సురక్ష కవచం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈసందరరేగా మునిసిపల్ వైస్ చైర్మన్ షేక్షావలి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం, స్వయం సహాయక సంఘాల మహిళల శారీరక, మానసిక, పోషకాహార ఆరోగ్యాన్ని కాపాడి, వారి ఆర్థిక సుస్థిరత సాధించడమే సఖి బిసురక్ష కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. 35 సంవత్సరాలు పైబడిన స్వయం సహాయక గ్రూపు మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, ఆధునిక యంత్ర సామాగ్రితో ఇంటివద్దనే హెల్త్ స్క్రీనింగ్, ఆరోగ్య అత్యవసర పరిస్థితుల్లో తక్షణ



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సిఫార్సులు, సేవలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులతో అనుసంధానం చేసి, దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ కొలెస్ట్రాల్ గుండె జబ్బుల పరీక్షలు చేయబడుతాయని తెలిపారు. ఈ పరీక్షలలో పోషకాహార లోపాలైనా రక్తహీనత, విటమిన్ లోపం, ప్రోటీన్ లోపం, రొమ్ము, గరాశేయం, నోటి కాన్సర్ ముందస్తు గుర్తింపు, మానసిక ఆరోగ్యం, డిప్రెషన్, ఆందోళన, ఒత్తిడి కౌన్సిలింగ్ అవసరాలు లభించే ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద ప్రత్యేక ఆరోగ్య కార్డుతో 25 లక్షల వరకు ఆరోగ్య బీమా కవరేజ్ ఏడాదికి కనీసం 4 సార్లు మహిళల ఆరోగ్యానికి, ఆనందానికి సురక్ష కవచంగా ఉందన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో మహిళలకు 20 రకాల పరీక్షలు ఉచితంగా చేయబడునని, పట్టణంలోని మహిళలందరూ సఖి సురక్ష కార్యక్రమం ద్వారా ఉచిత పరీక్షలు చేయించుకోగలరని మహిళలను కోరారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శివరామకృష్ణ, ప్రభుత్వ వైద్యులు హరిప్రసాద్, సిఎమ్ఎమ్ తులసి, కౌన్సిలర్లు అబ్దుల్ రహీం రంగనాథ్ రెడ్డి పాల్గొన్నారు.



సఖి సురక్షలో పాల్గొన్న వైస్ చైర్మన్ షేక్షావలి, కౌన్సిలర్లు

## ఏపిటిఎఫ్ 2026 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ

**యాడికి, డిసెంబర్ 29 :**
యాడికి మండల కేంద్రంలోని సంత మార్కెట్లో ఉన్న ఎంఆర్సిలో సోమవారం ఏపిటిఎఫ్ 2026 నూతన సంవత్సరం క్యాలెండర్లు డైరీలను మండల విద్యాధికారులు కాశప్ప. సీతారామాంజనేయులు ఆవిష్కరించచారు. . ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ 1947లో ఆవిరభేంచి ఇప్పటికీ ఉపాధ్యాయ సమస్యల పట్ల



ఎంఈఓలకు ఏపీటీఎఫ్ డైరీలు అందిస్తున్న రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాస్ యాదవ్



ఏపీటీఎఫ్ నూతన 2026 సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విద్యాధికారులు కాశప్ప. సీతారామాంజనేయులు

రాజీ లేని పోరాటాలను కొనసాగిస్తూ ఎన్నో ఉద్యమాలను చేపట్టి " బాధ్యతలకు నిలబడు హక్కులకై కలబడు " అనే నినాదంతో ముందుకెళ్తున్న సంఘం ఏపీటిఎఫ్ అని పేర్కొనడం అయినది. ఈ సందరరేగా విద్యాధికారులకు డైరీలను అందజేయడం అయినది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు నూర్ మహమ్మద్ రామంజి జిల్లా కౌన్సిలర్ నబి రసూల్ సంఘ సభ్యులు రవికుమార్ క ృష?మూర్తి చంద్రశేఖర్ రామాంజనేయులు జయరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అగాపే ఆశ్రమంలో అన్నదానం

**యాడికి, డిసెంబర్ 29 :**
యాడికి మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న ఆగాపే ఆశ్రమంలో సోమవారం పూర్వపు విద్యార్థులు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకులు ప్రసాద్ తెలిపారు. .యాడికి గ్రామంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నందు 1970-75సంవత్సరపు పూర్వపు విద్యార్థుల గెట్ టుగెదర్ ప్రోగ్రాం అక్టోబర్ 26వ తేదీన ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ బ్యాచ్ కి చెందిన ఆరుగురు పూర్వ విద్యార్థులు కలిసి సోమవారం అగాపే వృద్ధాశ్రమంలో



పదవ తరగతి విద్యార్థులకు సంబంధించి నగదును పధానోపాధ్యాయులు సీతారామాంజనేయులకు అందిస్తున్న పూర్వ విద్యార్థులు



ఆగాపే ఆశ్రమంలో పూర్వ విద్యార్థులు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం.

అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

***విశేష ప్రతిభ కలిగిన విద్యార్థులకు నగదు అందజేత..***

యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ. 5000 ,ద్వితీయ బహుమతిగా రూ. 3000, తృతీయ బహుమతిగా 2000 నగదును అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు సీతారామాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వై.వెంకటేశ్వర్లు, సి.మహబూబ్బాషా, ఎల్. నల్లప్ప,జై. సత్యనారాయణ, బి. మంజుల, ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాధనాన్ని దోచుకుంటున్న టీడీపీ నేతలు

**అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి..**
**కలెక్టర్‌కు వినతి ..**
**మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి..**

**తాడిపత్రి, డిసెంబర్ 29:**
తాడిపత్రి నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీ నేతలు ప్రజాధనాన్ని దోచుకునేలా వ్యవస్థ బద్ధమైన అవినీతికి పాల్పడుతున్నారని మాజీ శాసనసభ్యులు కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆరోపించారు. ఈ అవినీతి, అక్రమాలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ చేపట్టాలని కేతిరెడ్డి పెద్దారెడ్డి డిమాండ్



విలేఖరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

చేశారు. తాడిపత్రి నియోజకవర్గానికి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డితో సోమవారం అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్‌ని కలిసి వినతిపత్రాలను అందజేశారు. తాడిపత్రి నియోజకవర్గంలోని పలు గ్రామ పంచాయతీల్లో అభివ ృద్ధి పేరుతో కేటాయించిన నిధులను టీడీపీ నేతలు, వారి అనుచరులు అక్రమంగా దారి మళ్లించి కోట్లాది రూపాయల మేర ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని వినతిపత్రాల్లో వివరించారు. గ్రామాల్లో పనులు ప్రారంభం కాకుండానే పూర్తయినట్లుగా నకిలీ కొలత పుస్తకాలు, తప్పుడు రికార్డులు స ృష్టించి అక్రమంగా బిల్లులు డ్రా చేసినట్లు పేర్కొన్నారు. ఈ విధమైన చర్యలు ప్రజల కళ్లకు కనిపించకుండా పంచాయతీ వ్యవస్థనే నిర్వీర్యం చేసేలా కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.



క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

## విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే

**ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి..**

**తాడిపత్రి, డిసెంబర్ 29:**
విద్యార్థిని, విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని సోమవారం శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అరవింద శత జయంతి పాఠశాల నందు ప్రవైట్ స్కూల్స్ విద్యార్థిని, విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జేసీ అష్మిత్ రెడ్డి హాజరై, గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

## అమ్మ ఒడి ఆశ్రమంలో దుప్పట్లు పంపిణీ

**అనంతపురం కల్చరల్, డిసెంబర్ 29:**
అమ్మ ఒడి ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎ జీ ఎస్ ఆర్ ఆర్గనైజేషన్, ఎజి ప్రమీలమ్మ సౌజన్యంతో ఆశ్రమంలో ఉన్న ృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అంతకు ముందు హెచ్ఎల్‌సి కాలనీలోని కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారి భక్తులు భజనలు కీర్తనలు ఆలపించారు. అనంతరం నారాయణ సేవ మరియు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొల్హాపూర్ అమ్మవారు ఆలయ ప్రధాన కార్యదర్శి దేవనూర్ సుందరం విజయకుమార్ సాదు సాయి హర్షిత్ నాగ ప్రసాద్ రామకృష్ణ , శివమ్మ నాగరత్నమ్మ శ్రీదేవి అనుష తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన ఆలయాలు

**కనేకల్, డిసెంబర్ 29:**
మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని గోవింద్ ని ఆలయాలు అంగరంగ వైభవంగా ముస్తాబయ్యాయి. వైకుంఠ ఉత్తర ద్వారం ద్వారా భక్తులు మంగళవారం స్వామివారిని దర్శించు కోనున్నారు. అందుదకు తగిన ఏర్పాట్లను ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేశారు. ఏడాదిలో ఒకసారి వచ్చే వైకుంఠ ద్వార దర్శనం ఎంతో శుభప్రదమని ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకోవడం వల్ల అన్ని శుభాలు జరుగుతాయని సనాతన ధర్మం ఆచారం అన్నారు. వెంకటేశ్వర స్వామి ప్రతి ఆలయాన్ని మండలంలో విద్యుత్ కాంతి దీపాలతో రంగురంగుల పుష్పాలతో అలంకరించి అన్ని ఏర్పాట్లు చేశారు.



విద్యుత్ కాంతులతో వెంకటేశ్వర స్వామి ఆలయం

## అయ్యప్ప మాలదారులకు అన్నదానం

**వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి..**

**యాడికి, డిసెంబర్ 29 :**
యాడికి మండల పరిధిలోని పెద్ద పేట గ్రామంలో సోమవారం అయ్యప్ప స్వామి మాలాదారులకు సోమవారం వైసిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పెద్దపేట లక్ష్మీదేవి అయ్యప్ప మాలదారులకు( భిక్ష) అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం పెద్ద పేట గ్రామములోని లక్ష్మీదేవి నివాస వద్ద అయ్యప్ప మాలదారులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## ఇంద్రకీలాద్రిపై కేశఖండనశాల వెంట్రుకల వేలం ప్రక్రియ పూర్తి

**విజయవాడ, డిసెంబర్ 29 :**
విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భక్తులు సమర్పించే వెంట్రుకల విక్రయానికి సంబంధించి రెండేళ్ల కాల పరిమితి (2026-2028)కు గాను నిర్వహించిన టెండర్ ప్రక్రియ సోమవారం ఘనంగా ముగిసింది. గత టెండర్లతో పోలిస్తే ఈసారి దేవస్థానానికి భారీ స్థాయిలో ఆదాయం సమకూరింది.



శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామి

## నేడు శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి వైకుంఠ ఏకాదశి పూజలు

**అమరాపురం, డిసెంబర్ 29:**
అమరాపురంలో శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్యవైశ్య సంఘం వారు పేర్కొన్నారు. భక్తులు చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కుబడులు తీర్చుకోవాలని వారు కోరారు.



కంది పంటలో పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్న అధికారులు

## కందిలో పంటకోత ప్రయోగాలు ప్రారంభం

**బత్తలపల్లి, డిసెంబర్ 29:**
ఖరీఫ్ సీజన్ లో సాగుచేసిన కంది పంట దిగుబడిన శాస్త్రీయంగా అంచనా వేసేందుకు మండలంలో పంట కోత ప్రయోగాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండల సహాయ గణాంకాధికారి కే.ఎస్. లక్ష్మీనరసింహ శర్మ పర్యవేక్షణలో మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో సర్వే నెంబర్ 100-2ఎ లక్ష్మీనారాయణ చౌదరి పొలంలో 10-10మీటర్లలో పంటను కోసి వచ్చిన దిగుబడిని లెక్కించారు. ఈ సందర్భంగా సహాయ గణాంకాధికారి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి పసల్ భీమా యోజన కింద మండలంలో 20 ప్రాంతాల్లో ఈ ప్రయోగాలు చేపడతామని తెలిపారు. వీటి ద్వారా వచ్చే సగటు దిగుబడి ఆధారంగానే రైతులకు పంట బీమా పరిహారం అందుతుందని తెలిపారు. ఈ పంట కోత ప్రయోగాలను సంజీవపురం విహెచ్సి సాయిగురుచరిత్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఇన్సూరెన్స్ అధికారి మహేష్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీశక్తి పథకం అమలులో మహిళలకు గుర్తింపుకార్డు నిబంధనలు తొలగించాలి

**విజయవాడ, డిసెంబర్ 29:**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన స్త్రీశక్తీ పథకం భవిష్యత్‌లో మరింతగా విజయవంతం కావాలంటే మూడువేలు బస్సులను పెంచి,పదివేల సిబ్బందిని నియమించాలని, అలాగే మహిళా ప్రయాణీకులలో ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళా ప్రయాణీకులు పెద్దగా లేనందున ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డులు నిభందనలు తొలగిస్తే కండక్టర్లపై పనిబారం తగ్గడమే కాకుండా, కూటమి ప్రభుత్వానికి మహిళా ప్రయాణీకులలో ఇంకా మంచి పేరు వస్తుందని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞప్తి చేసామని ఏపి పిటిడి(ఆర్టీసి) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య,ఉప ప్రధానకార్యదర్శి యం.డి.ప్రసాద్ ఒక ప్రకటన తెలియజేసారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఓ శ్రీధర్

## పాఠశాల తనిఖీ

**మండల విద్యాధికారి శ్రీధర్ ..**

**రోళ్ల, డిసెంబర్ 29 :**
మండల పరిధిలోని రంగనపల్లి ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎం ఇ ఓ శ్రీధర్ తనిఖీ చేశారు.అటెండెన్స్ రిజిస్టరు, ఎండిఎం, అసెస్మెంట్ రికార్డులను తనిఖీ చేసి 75 రోజుల ప్రణాళిక గురించి పిల్లలను ప్రశ్నించారు. అదేవిదంగా మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థుల తో కలిసి భుజించి నాణ్యత ను పరిశీలించారు.



మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఇఓ శ్రీధర్

# రసాయనిక ఎరువులు, నానో యూరియా వినియోగంపై అవగాహన

**వ్యవసాయ అధికారి నాగరాజు..**

**అగళి, డిసెంబర్ 29 :**
జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారుల ఆదేశాల మేరకు అగళి మండలంలోని మధూడి, నరసంబుది గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు అగళి మండలం వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. ఇందులో భాగంగా రైతు సేవ కేంద్రాలలో రైతు సేవ కేంద్రం అధికారి తన పరిధిలో ఉన్న రైతులకు పంటల వారీగా రసాయనిక మందులు, ఎరువుల వాడకం పైన అదేవిధంగా యూరియా, నానో యూరియా,నానో డి ఏ పి వాడకం పైన అవగాహన కలిపించడం జరుగుతుందని యూరియా అధికంగా వాడటం వల్ల పంట పచ్చదనం పెరిగి తెగుళ్ల వచ్చే అవకాశం ఉందని కావున యూరియా వాడకం తగ్గించి నానో యూరియాను వాడాల్సిందిగా రైతులకు సూచించారు.వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు సూచించిన మోతాదులోనే పంటల వారీగా ఎరువులను వినియోగించాలి అని రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. రైతులు యూరియా గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రతి రైతు సేవా కేంద్రంలో కూడా పంటల అవసరం మేరకు యూరియా అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు,ప్రజాప్రతినిధులురైతు సేవ కేంద్రం సిబ్బంది,పాల్గొన్నారు.



రైతులకు ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



రైతులకు ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



శ్రీ అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహిస్తున్న గురుస్వాములు. శ్రీ అయ్యప్ప స్వామి గురు గురుస్వాములు

# వైభవంగా శ్రీ అయ్యప్ప స్వామి భజనలు

**అమరాపురం, డిసెంబర్ 29:**
మండల పరిధిలో వలస పంచాయితీ విరపసముద్రం గ్రామంలో వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయములో వైభవంగా శ్రీ అయ్యప్ప స్వామికి హెూమం, పూజలు ప్రధాన అర్చకులు హరీష్ బట్టర్, గురు స్వాములు దార మాదప్ప స్వామి,, వెంకటేష్ స్వామి, హనుమంతరాయ స్వామి రమేష్ స్వామి పెమ్మనహళ్లి నాగరాజు, మద్దప్ప నాగరాజు, భక్తిశ్రద్ధలతో భజనలు నిర్వహించారు. శ్రీ అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామికి అభిషేకం, వివిధ రకాల పూజలు అర్చకులు హరీష్ బట్టర్, గురు స్వాములు, నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పూలతో అలంకరణ చేశారు.. ఈ పూజా కార్యక్రమంలో మాల ధరించిన అయ్యప్ప భక్తులు భక్తిశ్రద్ధలతో భజనలు, కీర్తనలు పాడారు .. శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో భజనలు, శ్రీ అయ్యప్ప స్వామి భక్తి పాటలు చూడడానికి, వినడానికి వలస, విరప సముద్రం చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు తరలివచ్చారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు మంగళహారతి,తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదానం నిర్వహించారు. రేపు మంగళవారం శ్రీ అయ్యప్ప స్వామి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తమ మొక్కుబడులను తీర్చుకోవాలని శ్రీ అయ్యప్ప సేవా సమితి వారు తెలిపారు.



అయ్యప్ప కీర్తనలు పాడుతున్న స్వామి



ప్రధాన అర్చకులు హరీష్ బట్టర్ ఆశీర్వాదం తీసుకుంటున్న అయ్యప్ప భక్తులు. హెూమం నిర్వహిస్తున్న ప్రధానార్చకులు హరీష్

# రెండు కోట్లతో మడకశిర నగర పంచాయతీ అభివృద్ధి పనులు

**మడకశిర నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం.. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ..**

**రోళ్ల, డిసెంబర్ 29 :**
మడకశిర నగర పంచాయతీలో రెండు కోట్లతో నిర్మించే అభివృద్ధి పనులను త్వరితగతినా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధికారులను ఆదేశించారు. మడకశిర పట్టణం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పాల్గొన్నారు. గతంలో జరిగిన మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసిన అభివృద్ధి పనుల పురోగతి గురించి చర్చించారు, మంజూరైన రెండు కోట్లతో మడకశిర పట్టణం వార్డులలో అవసరమున్న చోట రోడ్డు మరియు డ్రైనేజ్ నిర్మాణ పనులు గత వైసిపి ప్రభుత్వం లో తాజ్ క్లినిక్ రోడ్డు వేయకుండా వదిలి వేయడంతో ఇప్పుడు మంజూరైన నిధులతో తాజ్ క్లినిక్ రోడ్డు, పూలే విగ్రహం బురుజు రోడ్డు, 15వ వార్డు , ప్రభుత్వ ఆసుపత్రి వెనకాల కూసే బండ,11వ వార్డు, మారుతీనగర్ మాళెరొప్పం, యాదవకాలనీ, టైలర్ కాలనీ, ఇంకా అవసరమున్న వార్డుల్లో రోడ్డు డ్రైనేజ్ పనులకు టెండర్లు పిలవాలన్నారు, పాత విద్యుత్ స్తంభాల మార్పు, కొత్త విద్యుత్ స్తంభాల కోసం ప్రతిపాదనలు పంపాలని విద్యుత్ అధికారులకు సూచించారు, మున్సిపాలిటీ లో అత్యవసరం ఉన్నచోట నీటి సమస్య విద్యుత్ డ్రైనేజ్ వంటి పనులకు రాజీ పడకుండా కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు సమన్వయం చేసుకొని ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఛైర్మన్ నరసింహ రాజు, మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ ,వైస్ చైర్మన్ వెంకట లక్ష్మమ్మ,ప్రభావతి హనుమంతు, కౌన్సిలర్లు ఉమాశంకర్,బలరాం సావిత్రమ్మ,సుజాతమ్మ మేఘన రమేష్, శ్రీనివాసులు ఓబులమ్మ, సుధాకర్ నాయక్,పార్వతమ్మ దాసప్ప, విక్రమ్ ప్రియాంక,సుభద్ర నాగేంద్ర, పాల్గొన్నారు,



ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజును సన్మానించిన మున్సిపల్ అధికారులు,



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు. కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న అధికారులు



శ్రీనివాస్ మూర్తిని సన్మానించిన యువ నాయకుడు ఎస్బిఐ మంజునాథ్

## పార్లమెంటరీ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ మూర్తికి ఘన సన్మానం

**యువ నాయకుడు ఎస్బిఐ మంజునాథ్**

**అగళి, డిసెంబర్ 29 :**
శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇరిగేపల్లి బి శ్రీనివాస్ మూర్తిని సోమవారం యువ నాయకుడు బొమ్మసానిపల్లి ఎస్బిఐ మంజునాథ్ ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలసి శాలువాకప్పి పూల మాలలు వేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందరరేగా శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీల సహకారంతో మండలంలో అభివృద్ధి పనులు చేయిస్తూ మండలంలో ఎప్పటిలాగే గ్రామాల వారిగా అందరితో కలిసి కట్టుగా పని చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో వంద శాతం స్థానాల్లో గెలిచేలా కృషి చేద్దామని అన్నారు.ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ఎస్బిఐ మంజునాథ్ తో పాటు మాజీ మండల కన్వీనర్ షౌకత్ అలీ ఖాన్,తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మండల టిడిపి నాయకులు

## రేపే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

**మండల నాయకులు..**

**అగళి, డిసెంబర్ 29 :**
జనవరి 1న ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ఆప్షనల్ హాలిడే ఉండటంతో డిసెంబర్ 31వ తేదీనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు మండల టిడిపి కన్వీనర్ తిప్పేస్వామి, జడ్పిటిసి ఉమేష్, టిడిపి పార్లమెంటరీ జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ మూర్తి, వైస్ ఎంపీపీ గాయత్రి హేమంత్ రాజు, సీనియర్ నాయకులు కోడిపల్లి రమేష్, యువ నాయకులు మంజు చరణ్ తెలిపారు.కూటమి ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను ముందుగానే గుర్తించి ఒకటో తేదీకి ఒకరోజు ముందుగానే రాష్ట్రానికి అనేక ఆర్థిక సమస్యలు ఎన్ని ఉన్నా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఘనత చంద్రబాబు అధ్యక్షతన నడుస్తున్న కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ఈ మేరకు అన్ని గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది డిసెంబర్ 31న లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.ఏవైనా కారణాల వల్ల మిగిలిపోయిన పెన్షన్లను జనవరి 2వ తేదీన పంపిణీ చేస్తారని అన్నారు. లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని అన్నారు.



బీసీ సంక్షేమ సంఘం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సిఐ ప్రభాకర్, ఎస్సై సోమశేఖర్, బీసీ సంఘం నాయకులు

## అన్నం పరబ్రహ్మ స్వరూపం

**సీఐ ప్రభాకర్..**

**బత్తలపల్లి, డిసెంబర్ 29:**
అన్నం పరబ్రహ్మ స్వరూపమని పేదవారి ఆకలి తీర్చడం వల్ల లభించే తృప్తి అమూల్యమైనదని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఆర్డీటి ఆసుపత్రి వద్ద రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని శ్రీసత్యసాయి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నామాల శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ పురాణాల ప్రకారం దానాల్లో ఉత్తమమైన దానం అన్నదానమని పెద్దలు చెబుతారన్నారు. ఎందుకంటే ఒకపూట భోజనం పెట్టి ఆకలితో ఉన్న వారి కడుపు నింపొచ్చు అన్నారు. ఇలా ఇతరుల కడుపు నింపడంవల్ల ఎంతో పుణ్యం లభిస్తుందని చాలా మంది నమ్మతారని వారు ఈ సందర్భంగా తెలియజేశారు నామాల శంకర్ మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి సోమవారం ఆరీటి ఆసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎక్కడి నుండి సుదూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వచ్చే రోగులకు, వారి అటెండర్లకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.అన్నదాన కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వయంగా సీఐ, ఎస్ఐలు అన్నం వడ్డించారు. ఇదే స్ఫూర్తితో తాము ఒక రోజు అన్నదానిని కార్యక్రమం నిర్వహిస్తామని వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య. సహాయ కార్యదర్శి వెంకటరమణ, దర్మవరం పట్టణ అధ్యక్షులు వెంకటేష్, ఉపాధ్యక్షులు రవి, తిరుపాలు,కొండయ్య, నరసింహులు, లక్కీ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై దృష్టి సారించండి

**ఎంపీడీవో రామారావు..**

**అమరాపురం, డిసెంబర్ 29:**
మండలములోని పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో పారిశుధ్యం పై దృష్టి సారించాలని ఎంపీడీవో రామారావు పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రామారావు కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో రామారావు మాట్లాడుతూ పంచాయతీలలో పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహించాలని రోడ్లలో చెత్తాచెదారం లేకుండా చూడాలని మురుగు కాలువలు శుభ్రం చేయించాలని పేరుకుపోయిన అపరిశుభ్రత తొలగించాలని వారు కోరారు. అదేవిధంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు ఈరన్న, నరేష్, గౌరమ్మ, నాగమణి , తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామారావు పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు

# స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి

***టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడిగుడ్ల ఏసేపు ..***

**పెద్దకడబూరు, డిసెంబర్ 29 :**




పెద్దకడబూరు మండలంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయానికి సైనికునిలా పని చేస్తానని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడిగుడ్ల ఏసేపు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం పెద్దకడబూరు గ్రామంలో ఏపీయుడబ్ల్యూజే ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు బసలదొడ్డి ఈరన్నలకు కోడిగుడ్ల ఏసేపు ప్రత్యేక క ృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, అన్ని గ్రామ సర్పంచులతో క్లీన్ స్వీప్ చేస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందజేస్తుందని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా సంక్షేమం, అభివ ృద్ధి కుంటుపడకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క ృషి చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివ ృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు క ృషి చేస్తానని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం పాలనను చూసి ఓర్వలేక వైసీపీ దుష్ప్రచారానికి ఒడి కడుతుందని, వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# శ్రీశైలంలో నేడు ముక్కోటి ఏకాదశి ఉత్సవం

**శ్రీశైలం, డిసెంబర్ 30**

డిసెంబరు 30న ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలంలో శ్రీ స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక ఉత్సవం నిర్వహించనున్నారు. వేకువజామున శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉత్తరద్వార దర్శనం, రావణవాహనసేవ నిర్వహిస్తారు. ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖమండప ఉత్తరద్వారం నుండి వెలుపలకు తోడ్కొనివచ్చి ఆలయ ఉత్తరభాగంలో రావణవాహనంపై ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ముక్కోటి ఏకాదశి రోజు ఉదయం గం.3.00లకు ఆలయద్వారాలను తెరచి మంగళ వాయిద్యాల అనంతరం గం.3.30ని!!లకు స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహిస్తారు. తరువాత శ్రీ స్వామిఅమ్మవార్లకు ప్రాత:కాలపూజలు జరిపించి 4.30 గంటలకు స్వామివారికి, తరువాత అమ్మవారికి మహామంగళహారతులు ఇస్తారు. ఉదయం 5. 30నిలకు రావణ వాహనసేవ ఉంటుంది.ఆ తరువాత శ్రీస్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహిస్తారు. శ్రీ స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం అనంతరం ఉదయం 6 తరువాత దర్శనాలు, ఆర్జితసేవలు ప్రారంభమవుతాయి.



# కొత్త ఏడాదిలో నూతనుత్తేజంతో పనిచేద్దాం

**ఏపీ ఎన్‌జీజీవో నేతలతో ముఖ్యమంత్రి**

**విజయవాడ, డిసెంబర్ 29:**

కొత్త ఏడాదిలో మరింత ఉత్సాహంతో నూతనుత్తేజంతో స్వర్ణాంధ్ర సాధన దిశగా పనిచేద్దామని, సమష్టి భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారు ఏపీ ఎన్‌జీజీవో, ఏపీ జేఏసీ నేతలతో అన్నారు. సోమవారం ఏపీ ఎన్‌జీజీవో, ఏపీ జేఏసీ నేతలు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో సంఘ క్యాలెండర్‌ను, డైరీ..2026 ను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. జేఏసీ నేతలు అందరి ముందు ఎన్జీవో సంఘ నాయకుల ముందు డైరీను, క్యాలెండర్ను ఆవిష్కరించిన గౌరవ ముఖ్యమంత్రివర్యులు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై పూర్తి అవగాహనతో పాటు స్పష్టమైన దృష్టి ఉందని, దశలవారీగా అన్ని అంశాలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేస్తూనే ఉద్యోగుల హక్కులను కాపాడే దిశగా నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేస్తూ రాష్ట్రాభివృద్ధిని వేగవంతం చేయడంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న ప్రణాళికాయుతమైన కృషికి ఉద్యోగ సంఘాల చొరవను జతచేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు.

ఏపీ ఎన్‌జీజీవోస్ అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో ఎన్‌జీజీవోస్, ఏపీ జేఏసీ కీలకభాగస్వామ్యం అవుతుందని.. గౌరవ ముఖ్యమంత్రి సారథ్యంలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నామని, ఉద్యోగుల సమస్యలు, ఆకాంక్షలు కూడా నూతన సంవత్సరంలో నెరవేరుతాయని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన విషయాలను ముఖ్యమంత్రి దగ్గర ఏపీ జెఎసి చైర్మన్ విద్యాసాగర్ ప్రస్తావించారు.

ఏపీ జెఎసి చైర్మన్ విద్యాసాగర్ గారి ఆధ్వర్యంలో కలిసి క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర సంఘ (2026)క్యాలెండర్ను ఆవిష్కరించారు ఏపీ ఎన్‌జీజీవో జనరల్ సెక్రటరీ డివి రమణ ఏపీ క్లాస్ ఫోర్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



# తిరుపతి చేరుకున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

**తిరుపతి, డిసెంబర్ 29 :**



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక విమానంలో కుటుంబసమేతంగా హైదరాబాద్ నుండి తిరుపతి చేరుకున్నారు. తిరుపతి విమానాశ్రయంలో రేవంత్ రెడ్డికి పసుపురంగు పుష్ప గుచ్చాలతో టీడీపీ మంత్రులు స్వాగతం పలికారు.

# ఎమ్మెల్యే సహకారంతో రహదారి గుంతలకు మరమ్మతులు

**పెద్దకడబూరు, డిసెంబర్ 29 :**

పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామ ప్రధాన రహదారిలో పడిన గుంతలకు మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో వైసీపీ రైతు విభాగం తాలూకా అధ్యక్షులు కేపీ యల్లప్ప, వైసీపీ నాయకులు బ్రహ్మయ్య ఆచారి, చెవుల లక్ష్మన్న, బోయ కడబూరి, మదిరె రాముడు, లింగన్న గౌడ్, సోమప్ప గౌడ్ గ్రావెల్ వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు రాయల చెరువు నిండి కడగమ్మ ఎక్కి ప్రవహించడంతో చెరువు కింద ఉన్న రహదారి గుంతలమయంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని గ్రామ వైసీపీ నాయకులు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ద ృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రహదారిలో పడిన గుంతలకు గ్రావెల్ వేసి మరమ్మతుల చేయించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నరసింహ ఆచారి, మల్లయ్య, బొడ్డన్న తదితరులు పాల్గొన్నారు.



*రహదారి గుంతల్లో గ్రావెల్ వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్న దృశ్యం*



*రహదారులోని గుంతలకు గ్రావెల్ వేయిస్తున్న దృశ్యం*

# సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీ మండల అధ్యక్షులు మల్లికార్జున

**మంత్రులు నిమ్మల నాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డితో భేటీ..**

**పెద్దకడబూరు, డిసెంబర్ 29 :**

ముఖ్యమంత్రి చంద్రబాబును టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మతో కలిసి పెద్దకడబూరు టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనను టీడీపీ మండల అధ్యక్షులుగా నియమించినందుకు గవిగట్టు మల్లికార్జున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెద్దకడబూరు మండలంలో చోటు చేసుకొన్న రాజకీయ పరిస్థితులను ముఖ్యమంత్రికి వివరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. మండలంలో పార్టీ బలోపేతానికి, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని మల్లికార్జున చెప్పారు. అనంతరం మంత్రులు నిమ్మల నాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డిలను కలిశారు.



*సీఎం చంద్రబాబును కలిసిన పెద్దకడబూరు టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున*



*మంత్రి నిమ్మల నాయుడు, మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసిన పెద్దకడబూరు టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున*

# సత్యసాయి జిల్లాను టీడీపీకి కంచుకోట చేయడమే లక్ష్యం

**పార్లమెంటు కమిటీ సభ్యులు అంకిత భావంతో పనిచేయాలి.. ఆత్మీయ పరిచయ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు..**

**రోళ్ల, డిసెంబర్ 29 :**

శ్రీ సత్యసాయి జిల్లాను తెలుగుదేశంపార్టీకి కంచుకోటగా చేయడమే లక్ష్యంగా అందరం కలిసి కట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని హిందూపురం పార్లమెంటు కమిటీ సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ పరిచయ కార్యక్రమంలో మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు సత్యసాయిజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు అన్నారు. పుట్టపర్తి, కమ్మవారిపల్లి రోడ్డు, వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలోని సదన్ మేడ గెస్ట్ హౌస్ లో హిందూపురం పార్లమెంటు కమిటీ సభ్యులతో ఆత్మీయ పరిచయ కార్యక్రమాన్ని ఎం.ఎస్.రాజు నిర్వహించారు. ఈ సందదరేగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లాలో తెలుగుదేశంపార్టీని బలోపేతం చేసేందుకు కమిటీ సభ్యులంతా తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. పార్టీ అధిష్ఠానం మనమీద పెట్టుకున్న నమ్మకాన్ని నూటికి నూరుశాతం నిలబెట్టుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు.వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎన్నో కష్టాలు, నిందలు, అవమానాలు ఎదుర్కొన్నటువంటి టీడీపీ కార్యకర్తలకు అందరం అండగా నిలవాలన్నారు. వారిని అన్ని విధాలా ప్రోత్సహిస్తూ, పార్టీలో ముందుకు నడిపించాలన్నారు. తెలుగుదేశంపార్టీకి కార్యకర్తలే అధినేతలు అనే విషయాన్ని ఆచరణాత్మకంగా శ్రీ సత్యసాయిజిల్లాలో చేసి చూపించాలి. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా నిలబడుతుందనే నమ్మకాన్ని కలిగించాలన్నారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తెలుగుదేశంపార్టీ నాయకులకే చెప్పుకునేలా ఒక స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించాలన్నారు. అధికారులు, ప్రజలకు మధ్య నాయకులు సమన్వయకర్తలుగా ఉండాలి. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జోడెద్దుల బండిలా వేగంగా ముందుకు నడిపించేందుకు కష్టపడాలన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాను రాష్ట్రంలోనే అన్ని విధాలా ముందు వరుసలో నిలబెట్టేందుకు కమిటీ సభ్యులు, నాయకులు కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులకు ఏ సమస్య వచ్చినా జిల్లా అధిష్ఠానం దృష్టికి తీసుకొచ్చి, సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. పార్టీకి చెడ్డపేరు వచ్చే విధంగా ఎవరూ వ్యవహరించకుండా జాగ్రత్తగా ఉంది. పార్టీ అధినాయకుడికి అన్ని విధాలా శ్రీ సత్యసాయిజిల్లా నిలబడిందన్నారు. భవిష్యత్తులో నిలబడుతుంది అనే నమ్మకాన్ని కల్పించాలన్నారు. పార్టీని గ్రామ, మండలం, జిల్లా స్థాయిలో బలోపేతం చేసుకుంటూ పనిచేయాలి అని ఎం.ఎస్.రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ప్రధానకార్యదర్శి హనుమప్ప, నూతనంగా నియమించబడిన హిందూపురం పార్లమెంటు టీడీపీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



*సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు ఎంఎస్ రాజు*



*ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమప్పను సన్మానించిన నాయకులు*

# రాయచోటి అభివృద్ధికి సీఎం చంద్రబాబు హామీ

***మంత్రి మండిపల్లి.***

**విజయవాడ, డిసెంబర్ 29:**

జిల్లాల పునర్విభజన అంశాలలో భాగంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డినీ సీఎం చంద్రబాబు నాయుడు భరోసా నిచ్చారు. ఈ నేపథ్యంలో సీఎంఓ నుండి ఫోన్ కాల్ రావడంతో, మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు ముఖ్యమంత్రిని కలిశారు. ఈ భేటీలో రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్, సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడు కూడా ఉన్నారు. రాయచోటి అగ్రగామిగా నిలిచేలా ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. రాయచోటిపై తనకున్న అనుబంధం, మమకారం గురించి ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో రూపొందించిన ప్రణాళికల ప్రకారమే రాయచోటిని ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. అవసరమైన అన్ని మౌళిక సదుపాయాలు, పరిపాలనా సదుపాయాలతో రాయచోటి మరింత ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, రాయచోటిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు మంత్రి మండిపల్లికి స్పష్టం చేశారు. రాయచోటి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా మరింత కృషి చేస్తానని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.






# కులం పేర దూషణ, దాడి ముగ్గురిపై కేసు నమోదు

**ఎస్ఐ నిరంజన్ రెడ్డి ..**

**పెద్దకడబూరు, డిసెంబర్ 29 :**

పెద్దకడబూరు గ్రామానికి చెందిన మాల గురుస్వామిపై ఇదే గ్రామానికి చెందిన ప్రవీణ్, బందె నవాజ్, నరసింహ కులం పేరుతో దూషించి దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 28న గురుస్వామి రాత్రి 10:30 గంటల సమయంలో సీఎస్ఐ చర్చి వద్ద చలిమంట వేసుకొని కూర్చొని ఉండగా కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డారని తెలిపారు. గత 20 రోజుల క్రితం బైక్ పై వెళుతుండగా రోడ్డులో ఉన్న వీరేష్ ను పక్కకు జరగమని చెప్పినందుకు అది మనస్సులో పెట్టుకొని తనను కులం పేరుతో దూషించి తనపై దాడి చేశారని గురుస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.




# ఉర్దూ భాషను వృద్ధిలోకి తీసువచ్చిన సీఎం చంద్రబాబు

***ఎంపీ కేశినేని శివనాథ్..***

**విజయవాడ, డిసెంబర్ 29:**

ఆంధ్రప్రదేశ్‌లో ఉర్దూ భాషను వృద్ధిలోకి తీసుకువచ్చిన ఒకే ఒక్క నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు అని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ స్పష్టం చేశారు. తమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం జరిగిన రాష్ట్ర ఉర్దూ అకాడమీ స్వర్ణత్సోవ వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీ కేశినేని శివనాథ్ కు ఉర్దూ అకాడమీ చైర్మన్ గా ముహమ్మద్ ఫారూక్ షిబ్లీ స్వాగతం పలికారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర న్యాయ,మైనార్టీ శాఖ మంత్రి ఎన్.ఎండి.ఫరూక్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడే ప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణలతో పాటు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం, ఉర్దూ భాష కోసం సీఎం చంద్రబాబు నాయకత్వంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం తమ్మలపల్లి ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ ఉర్దూ అకాడమీ స్వర్ణత్సోవ వేడుకలు ఇంత ఘనంగా నిర్వహించిన ఉర్దూ అకాడమీ చైర్మన్ ముహమ్మద్ ఫారూక్ షిబ్లీ ను అభినందించారు. దేశంలోనే ప్రప్రథమంగా ఉర్దూ యూనివర్శిటీ ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు కూడా ఉర్దూ అకాడమీ ఎంతో తోడ్పాడు అందించి వృద్దిలోకి తీసుకురావటం జరిగిందన్నారు. తెలుగు దేశం పార్టీ మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం తో పాటు ఉర్దూ భాషను కూడా వృద్దిలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కర్నూల్ లో 175 ఎకరాలు ఇచ్చి ఉర్దూ యూనివర్శిటీ స్థాపిస్తే గత ప్రభుత్వం ఉర్దూ యూనివర్శిటీకి ఒక రూపాయి కూడా ఖర్చుపెట్టలేదంటూ మండిపడ్డారు. నారా చంద్రబాబు నాయుడు సీఎంగా అధికారంలోకి వచ్చిన తర్వాత ఉర్దూ భాషను అభివృద్ది చేసేందుకు ఉర్దూ అకాడమీ చైర్మన్ గా ముహమ్మద్ ఫారూక్ షిబ్లీ నియమించటం జరిగిందన్నారు. చైర్మన్ గా షిబ్లీ నెలరోజుల్లోనే ఏన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కర్నూల్ లో కూడా ఉర్దూ యూనివర్శిటీ ప్రారంభోత్సవం వుంటుందని తెలిపారు.



# సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి హిందువు బాధ్యత

## ధర్మమే హిందూ సమాజానికి బలం..
## దువ్వూరులో వైభవంగా హిందూ సమ్మేళనం
## బ్రహ్మంగారిమఠం ఈశ్వరి దేవి పీఠాధిపతులు శ్రీ వీర శివకుమార్ స్వామి..



హిందు సమ్మేళనంలో ప్రసంగిస్తున్న వక్తలు

**దువ్వూరు, డిసెంబర్ 29:**
సనాతన ధర్మం ప్రపంచానికే మార్గదర్శకమని, అటువంటి ధర్మాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని బ్రహ్మంగారిమఠం ఈశ్వరిదేవి మఠం పీఠాధిపతులు శ్రీ వీర శివకుమార్ స్వామి ఉద్ఘాటించారు. సోమవారం దువ్వూరు మండల కేంద్రంలో హిందూ సమ్మేళన నిర్వాహక సమితి ఆధ్వర్యంలో 'హిందూ సమ్మేళనం' నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వీర శివకుమార్ స్వామీ మాట్లాడుతూ సనాతన ధర్మం పురాణాలు, ఇతిహాసాల ద్వారా పురుడు పోసుకుందని, ఈ ధర్మం నడిచినప్పుడే లోకమంతా క్షేమంగా ఉంటుందని అన్నారు. స్వామి వివేకానంద వంటి మహనీయులు హిందూ ధర్మం కోసం విదేశాల్లో సైతం పోరాడారని గుర్తు చేశారు. ప్రతి తల్లి తన పిల్లలను ఛత్రపతి శివాజీ, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి ధీశాలురుగా తీర్చిదిద్దాలని, ఆధ్యాత్మికత ద్వారానే హిందూ సమాజం ఐక్యంగా ఉండగలదని పిలుపునిచ్చారు.

ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రముఖ్ వేణుగోపాల్ నాయుడు మాట్లాడుతూ.. మన సంస్కృతిలో కుల వివక్షకు తావులేదని, సామాజిక సమరసత ఇమిడి ఉందని తెలిపారు. గతంలో హిందువుల మధ్య ఉన్న అనైక్యత వల్లే విదేశీయులు మన దేశాన్ని పాలించగలిగారని, ప్రస్తుత తరుణంలో కులాలు, రాజకీయాలకు అతీతంగా హిందువులందరూ ఏకతాటిపైకి రావాలని కోరారు.


హిందు సమ్మేళనంలో పాల్గొన్న హిందూ బంధువులు

**ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు..**
కార్యక్రమం ప్రారంభంలో స్వామీజీకి నిర్వాహకులు పూలమాలలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన మహిళల కోలాటం ప్రదర్శన సభికులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సమ్మేళనంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ప్రతినిధులు, ప్రముఖులు మరియు చుట్టుపక్కల ప్రాంతాల నుండి వేలాదిమంది హిందువులు పాల్గొన్నారు. సమ్మేళనం ఆద్యంతం భక్తిభావంతో, ఐక్యతా నినాదాలతో మారుమోగింది. ఇక్కడికి వచ్చిన హిందూ బంధువులకు దాతల సహకారంతో అల్పాహారం ఏర్పాటు చేశారు


డిఎస్పి గీతా కుమారి

# అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

### డి.ఎస్.పి గీతా కుమారి..

**గూడూరు, డిసెంబర్ 29:**
నూతన సంవత్సర వేడుకల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డి.ఎస్.పి గీతా కుమారి అన్నారు. 31వ తేదీ రాత్రి ఎవరైనా బైక్ రేసింగ్ నిర్వహిస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. రోడ్లపై కేకులు కట్ చేయరాదని, డీజేలు, భారీ శబ్దాలతో స్పీకర్లు డాన్స్ కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. తల్లిదండ్రులు చిన్న పిల్లలకు స్కూటర్లు ఇవ్వవద్దన్నారు. ప్రమాదాల జరిగితే తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. నూతన సంవత్సర వేడుకల పేరుతో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.
నివాసాల ముందు ముగ్గులు వేసేటప్పుడు మహిళల అప్రమత్తంగా ఉండాలని, మెడలో విలువైన ఆభరణాలు ధరించవద్దు అని సూచించారు. పండుగల సందర్భంగా సొంత గ్రామాలకు వెళ్ళేటప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్ లో తెలియజేయండి దొంగతనాలు జరగకుండా ఇంటిపై నిఘ ఉంచుతామన్నారు. ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జరుపుకోవాలని డిఎస్పి గీతా కుమారి సూచించారు.

# ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి రూ. కోటి పరిహారం

**అమరావతి, డిసెంబర్ 29:**
విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ పిచ్చేశ్వర రావు కుటుంబానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం రూ.1 కోటి పరిహార చెక్కును అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం%-%స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మధ్య 2025 మార్చిలో కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం అమలులో ఉన్న ఎస్‌బీఐ బీమా పథకం కింద ఈ పరిహారం మంజూరైంది. ఒప్పందం తర్వాత ఈ పథకం ద్వారా పరిహారం అందజేయడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యుల్లో అర్హులైన వారికి కారుణ్య నియామకం కల్పిస్తామని తెలిపారు. ఎక్సైజ్ శాఖను ప్రభుత్వం ఏర్పడిన తక్కువ సమయంలోనే పునఃవ్యవస్థీకరించి, సమర్థంగా ముందుకు నడిపించినందుకు ముఖ్యమంత్రికి ఎక్సైజ్ అధికారులు, ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. శాఖ అభివృద్ధికి సహకరించిన ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రకు, ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనాలను అభినందించారు.
ఎక్సైజ్ శాఖ అధికారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అందరూ నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ ఆదాయం కన్నా ప్రజల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ఎస్‌బీఐ ఎస్ జి ఎస్ పి సాలరీ ఖాతా ద్వారా ఇలాంటి విలువైన బీమా ప్రయోజనాలు కల్పించడం అభినందనీయమని ఉద్యోగ సంఘం నేతలు తెలిపారు.

# రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో యూరియా బస్తాలు

## మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి..


రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి

**ముద్దనూరు, డిసెంబర్ 29:**
మండలంలోని రైతు సేవ కేంద్రాలలో రైతులకు యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బొందలకుంట రైతు సేవా కేంద్రంలో రైతులకు యూరియా బస్తాలను ఆయన రైతులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బొందలకుంట రైతు సేవా కేంద్రానికి 220 బస్తాలు(9.9 మెట్రిక్ టన్నుల) వచ్చాయని అన్నారు.అలాగే యామవరం రైతు సేవా కేంద్రంలో 220 బస్తాలు లేదా 9.9 మెట్రిక్ టన్నులు రైతులకు అందుబాటులో ఉంది అన్నారు. రైతులకు డిబిటి పద్ధతిలో యూరియా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు యూరియాను అనవసరంగా వాడరాదు అన్నారు.అవసరం మేరకే , సిఫారస్ చేసిన మేరకే ఆయా పంటలకు వాడుకోవాలి అన్నారు.మండలంలో ప్రస్తుతం యామవరం,బొందలకుంట రైతు సేవా కేంద్రాల్లో 440 బస్తాలు యూరియా అందుబాటులో ఉంది అని వచ్చిన రైతులకు డిబిటి పద్ధతిలో పంపిణీ చేస్తున్నామని తెలిపారు.యూరియాను దుర్వినియోగం చేయరాదు అన్నారు.రానున్న రెండు రోజుల్లో కొర్రపాడు, శెట్టివారిపల్లె,కొత్తపల్లె,కొలవలి రైతు సేవా కేంద్రాలకు ఒక్కొక్క రైతు సేవా కేంద్రానికి 9.9 మెట్రిక్ టన్నుల చొప్పున యూరియా వస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు కల్పన, మహిళా పోలీసు నందిని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ముని భూపాలుడు ,శ్రీదేవి, యమున పాల్గొన్నారు.


రైతులకు యూరియా అందిస్తున్న వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి



చిన్నపిల్లలపై లైంగిక దాడుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించిన దృశ్యం

# చిన్నపిల్లలపై లైంగిక దాడుల నివారణపై అవగాహన సదస్సు

**ముద్దనూరు, డిసెంబర్ 29:**
చిన్న పిల్లలపై లైంగిక దాడుల నివారణపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ ప్రసాద్ ఆధ్వర్యంలో సమంత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ కరిస్మా, డాక్టర్ శ్రీకాంత్, హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ యాదవ్,డాక్టర్స్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శిక్షణ తీసుకొని మండలంలో లైంగిక దాడులు జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. టి ఓ టి లు బాలల సత్వర చికిత్స కేంద్రం చైల్డ్ సైకాలజిస్ట్ ఉదయ చంద్రిక, జమ్మలమడుగు ప్రాంతీయ ఆరోగ్య కేంద్రం, రాష్ట్రీయ కిషోర స్వస్తియా కార్యక్రమం సంబంధించిన ఆడోల్సెంట్ కౌన్సిలర్ డి. బాల గురప్ప పిల్లలపై లైంగిక దాడుల రకాలు, పిల్లలపై మానసిక గాయాలు, వాటి ప్రభావాలు మరియు పిల్లల ప్రవర్తన పై శిక్షణ ఇచ్చారు. అలాగే పిల్లలపై ఆక ృత్యాలు జరగకుండా చూడవలసిన బాధ్యత అందరిపై ఉందని పిల్లలకు అవగాహన, హద్దులు, కమ్యూనికేషన్ గురించి చెప్పాలని తెలిపారు. అంతేకాకుండా పిల్లల రక్షణ చట్టాలైన ఫోక్సు చట్టం గురించి, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 టోల్ ఫ్రీ నెంబర్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ జయకర్ ,ఐసిడిఎస్ సూపర్వైజర్ విశాల లక్ష్మి, ఐసిడిఎస్ సిబ్బంది మరియు హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసి చైర్మన్ జీఎం రాజు

# ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధ్యం

### ఏఎంసి జీఎం చైర్మన్ రాజు

**రామకుప్పం, డిసెంబర్ 29:**
రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు అని ఏఎంసి చైర్మన్ జీఎం రాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక శ్రీ శక్తి భవనం వద్ద రైతులతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయల సాగులో ప్రకృతి అందించిన కషాయాలతో పంటలపై పిచికారి చేసుకొని అధిక దిగుబడి సాధించవచ్చున్నారు. దీంతో కూరగాయలు ప్రజలు తినడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో కూరగాయల సాగుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, త్వరలో మినీ ఎయిర్ స్ట్రిప్ నిర్మాణంతో ఇతర దేశాలకు ఎగుమతులతో ఇక్కడి రైతులు ఆర్థిక అభివృద్ధి చెందుతారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయపరంగా సంక్షేమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు సీతాపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మునేంద్ర నాయక్, పవన్ కుమార్, క్లస్టర్ కో ఇన్చార్జ్ శంకరాచలం, అల్లిశీన, హనుమంతు, హార్టికల్చర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ కేశినేనిని కలిసిన నాదెళ్ల నాగమణి

**విజయవాడ, డిసెంబర్ 29:**
తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా కోశాధికారిగా నియమితులైన తిరువూరు నియోజవర్గానికి చెందిన నాదెళ్ల నాగమణి మర్యాద పూర్వకంగా ఎంపీ కేశినేని శివనాథ్ ను కలిశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఎంపీ కేశినేని శివనాథ్ ను ఆమె టిడిపి మహిళ నాయకులతో కలిసి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ ఆమెకు అభినందనలు తెలిపారు. జిల్లాలో టిడిపి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళ నాయకులు దొంతు హైమవతి, మట్టా ఉషా, కొలికపోగు రామకోటమ్మ పాల్గొన్నారు.

# మై టిడిపి యాప్‌తో కార్యకర్తలకు గుర్తింపు

## సుపరిపాలనలో తొలి అడుగు విజయవంతం..
## విజయం చేకూర్చిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు, ప్రశంసాపత్రం ..
## ఎమ్మెల్యే శ్రీకాకర్ల సురేష్ ..



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాకర్ల సురేష్

**ఉదయగిరి(వింజమూరు), డిసెంబర్ 29**
తెలుగుదేశం పార్టీ ప్రతిష్మాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని మై టిడిపి యాప్ ద్వారా గ్రామంలోని ప్రతి గడపకు తిరిగి విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తను టెక్నికల్ ద్వారా గుర్తించి వారికి తగిన ప్రాధాన్యతనిస్తూ పార్టీ ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే శ్రీకాకర్ల సురేష్ పంపిణీ చేశారు. వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధ్యక్షతన సోమవారం నాడు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల రథసారధుల సారథ్యంలో పండుగ వాతావరణంలో కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేశారని వారి కృషి ఫలితంగానే నియోజకవర్గంలో 97 వేల సభ్యత్వాలను పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ కోసం పని చేసే వారేనని కాకపోతే టెక్నికల్ ద్వారా అధిష్టానం దృష్టికి వెళ్ళిన వారి పేర్లు మాత్రమే వచ్చాయని మిగిలిన వారు కూడా తగిన గుర్తింపు వస్తుందని తెలియజేశారు. కార్యకర్తలను ఉత్సాహపరిచి పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు నాయకత్వం పనిచేస్తుందన్నారు. వచ్చే ఏడాది కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తానని తెలిపారు. విడతలవారీగా అందరికీ న్యాయం జరుగుతుందని ఎవరు అధైర్యపడవలసిన అవసరం లేదన్నారు.నియోజకవర్గంలో 8 మండలాలలో ఆరు మండలాలకు కన్వీనర్లను నియమించడం జరిగిందని త్వరలోనే ఉదయగిరి, కలిగిరి మండలాలకు నియమించడం జరుగుతుందన్నారు. ముందస్తుగా నూతన సంవత్సర 2026, శుభాకాంక్షలు నియోజకవర్గ ప్రజలకు నాయకులకు అధికారులకు ఎమ్మెల్యే తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ కదిరి రంగారావు,టెలికాం అడ్వైజర్ కమిటీ సభ్యులు, తాటికొండ అనూష, రాష్ట్ర గిరిజన రాష్ట్ర గిరిజన అభివృద్ధి కార్పొరేషన్ మెంబర్ ఆవుల అరుణ, కన్వీనర్లు గూడా నరసారెడ్డి, ఉండేలా గురువా రెడ్డి,చంద్ర మధుసూదన్ రావు, సిహెచ్ బయన్న, చింతల శ్రీనివాసులు, పోలినేని చంద్రబాబు నాయుడు, తిరుమలరెడ్డి, బిజ్జం కృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్లు, మాజీ కన్వీనర్లు, మధుమోహన్ రెడ్డి, ప్రభాకర్ రాజు, బిజెపి మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ముఖ్య నాయకులు, కూటమి నేతలు,కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాకర్ల సురేష్

# కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా మేకపాటి నియమకం

## మేకపాటి మాల్యాద్రి నాయుడుకు ఘన సత్కారం..
## దుత్తలూరు మండల బిజెపి నాయకులు..


కిసాన్ మోర్చా జిల్లా మేకపాటి మాల్యాద్రి నాయుడును సన్మానిస్తున్న బిజెపి నేతలు

ఉదయగిరి(దుత్తలూరు), డిసెంబర్ 29 :
భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మేకపాటి మాల్యాద్రి నాయుడును సోమవారం నాడు నర్రవాడలోని ఆయన కార్యాలయంలో పలువురు బిజెపి నాయకులు కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా కార్యవర్గ సభ్యులు చుండి హరి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మేకపాటి మాల్యాద్రి నాయుడు కార్యకర్తలను చేయి పట్టి నడిపించిన వ్యక్తి అన్నారు. తన లాంటి ఎంతో మంది కార్యకర్తలను తయారు చేసిన నిబద్ధత కలిగిన బీజేపీ కార్యకర్త అని అన్నారు. నిత్యం ప్రజా సేవకుడు, బిజెపి అభివృద్ధికి నిరంతర శ్రామికుడు, ప్రజలకు వివిధ మార్గాల్లో సేవ చేస్తున్న కృషిని జిల్లా నాయకత్వం గుర్తించి ఆయనకు రెండో పర్యాయం భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ కిసాన్ మోర్చా నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించారు అని తెలిపారు. భాజపా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు స్వీకరించిన సందర్భంగా సోదరులు సమానులు మేకపాటి మాల్యాద్రి నాయుడు ను ఘనంగా సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.భారతీయ జనతా పార్టీ దుత్తలూరు మండల ప్రధాన కార్యదర్శి అందే రామయ్య, మండల ఉపాధ్యక్షుడు పసల కృష్ణ ఇరువురు మాట్లాడుతూ మా అన్న మేకపాటి మాల్యాద్రి నాయుడు కు కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి,శ్రీ వెంగమాంబ పేరంటాలు తల్లి, శ్రీ మాల్యాద్రి లక్ష్మి నరసింహ స్వామి ఆశీస్సులతో ఆయనకు నిండు నూరేళ్ళు ఆరోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించి మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


కిసాన్ మోర్చా జిల్లా మేకపాటి మాల్యాద్రి నాయుడును సన్మానిస్తున్న బిజెపి నేతలు

# అనధికారికంగా పైప్‌లైన్ తవ్వకాలు అడ్డుకోండి

### అడ్డుకోబోతే దౌర్జన్యం, దాడి యత్నం.. ఏ ఐ వై ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొ(ట్రేష్ ..

**కనేకల్, డిసెంబర్ 29 :**
కణేకల్ మండలం పరిధిలోని బ్రహ్మసముద్రం గ్రామ పాతూరులో ఇష్టానుసారంగా పైప్‌లైన్లు వేస్తున్నారని ఏ ఐ వై ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొ(ట్రేష్ ఆరోపించారు. అడ్డుకోబోతే దౌర్జన్యం చేసి దాడి యత్నం చేశారన్నారు. పంచాయతీ అనుమతులు తీసుకోకుండా కొంతమంది అనుమతులు తీసుకోకుండా అధికారులకు సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా ఇంటి మురికి నీటిని మళ్లించడానికి పైప్‌లైన్ (ఎస్టిమేషన్ లేకుండా) వేసి ఇతరులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. దీనిపై బ్రహ్మసముద్రం గ్రామపంచాయతీ సెక్రటరీని కలిసి ఫిర్యాదు చేశామన్నారు. ఆయన ఆదేశాలు ఇచ్చినా కేవలం వారికి సూచనలు ఇచ్చారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఫలితంగా స్థానికుల మధ్య గొడవలు జరుగుతున్నాయన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.


బ్రహ్మసముద్రంలో పైప్‌లైన్ వేస్తున్న దృశ్యం


బ్రహ్మసముద్రంలో పైప్‌లైన్ వేస్తున్న దృశ్యం

# మన యాడికి పరిశుభ్రత - మనందరి బాధ్యత

### ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి..

**యాడికి, డిసెంబర్ 29 :**
యాడికి మండల కేంద్రంలో శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి సోమవారం నిర్వహించిన మన యాడికి పరిశుభ్రత. మన అందరి బాధ్యత, పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. రాఘవేంద్ర కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు, గ్రామంలోని కాలనీలలో ముళ్లపొదల తొలగింపు , మురికి కాలువల శుభ్రత, ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న మట్టి తదితర వాటి తొలగింపు జెసిపిలతో తొలగించి శుభ్రపరిచారు, అనంతరం వేములపాడు రోడ్ లో ఉన్న మార్కెట్ యార్డ్ సంపు వద్ద సందర్శించి ప్రజలకు తాగనీటి సౌకర్యం కోసం నూతనంగా రెండు కొత్త100 హెచ్ పి మోటార్లను ప్రారంభోత్సవం చేశారు వీటితోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీర రాజు. తహసిల్దార్ ప్రతాపరెడ్డి. డి ఈ ఎల్లం నాయుడు. మండల ఇంజనీర్ వరప్రసాద్. ఆర్డబ్ల్యూఎస్ ఈఈ దేవకుమార్. ఇంచార్జ్ యాడికి ఈవో వరుణ్ కుమార్. తెదేపా మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ యాదవ్. దేరంగుల నాగ శేఖర్. త్రినాథ్ రెడ్డి. నాగ ముని రెడ్డి. సూర్యనారాయణ రెడ్డి. రంగయ్య. రాజశేఖర్ నాయుడు. చిట్టిబాబు. మధు రాజు. విశ్వనాథ్. నాయకులు బిజెపి జనసేన నాయకులు. సచివాలయ సిబ్బంది. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి


యాడికి చింతావనం ఆంజనేయ స్వామి గుడి వద్ద మురికి నీరుని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి


పరిశుభ్రతపై అధికారులు, నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి

# వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు అప్రోచ్ రోడ్ల నిర్మాణం

### పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి

**ఆమడగూరు, డిసెంబర్ 29 :**
ఆమడగూరు మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల సౌకర్యార్థం కోసం వ్యవసాయ పొలాల కు వెళ్లేందుకు 10 అప్రోచ్ రోడ్లు రూ. 56లక్షల 75 వేలు నిధులు మంజూరైనట్టు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తెలిపారు. ఆమడ గూరు మండల కేంద్రంలో చౌడేశ్వరి కళ్యాణ మండపంలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ కార్యక్రమానికి సోమవారం విచ్చేసిన సందర్భంగా ఉపాధి హామీ పథకం కింద మంజూరైన అప్రోచ్ రోడ్ల వివరాలను ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి వెల్లడించారు. మండలంలోని చిన్నగానిపల్లి పంచాయతీలో చినగానిపల్లి గ్రామం నుంచి స్మశాన వాటిక సమీపంలో అప్రోచ్ రోడ్డుకు 5 లక్షల 69 వేల 352 లు , చిన్న గాని పల్లి నుంచి పెరమాండ్లపల్లి వయా మోడల్ స్కూల్ గాజుల బండ వరకు అప్రోచ్ రోడ్డు 11లక్షల పైగా మంజూరు అయినట్లు తెలిపారు. మహమ్మదాబాద్ పంచాయతీలో మిత్తి మురన్ రోడ్డు నుంచి గొల్లపల్లి టు ముసలమ్మకణం వరకు రూ.5,67,232 లక్షలు , మహమ్మదాబాద్ గ్రామం నుంచి ముస్లింల స్మశాన వాటిక వరకు , అప్రోచ్ రోడ్డు వేస్తామన్నారు.


ొ మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నాయకులు తగ్గుపర్తి రాధాకృష్ణ, టీడీపీ నాయకులు మల్లికార్జున

# ప్రెస్ క్లబ్ అడ్ హాక్ కమిటీలో గుర్తింపు సంఘాలకు స్థానం ఇవ్వాలి

### కలెక్టర్‌కు వినతిపత్రం..

**అనంతపురం రూరల్, డిసెంబర్ 29 :**
రాష్ట్ర ప్రభుత్వంతో గుర్తింపు పొందిన జర్నలిస్ట్ సంఘాలకు ప్రెస్‌క్లబ్ అడ్ హాక్ కమిటీలో స్థానం కల్పించాలని గుర్తింపు పొందిన జర్నలిస్ట్ సంఘాలు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కోరాయి. ప్రెస్‌క్లబ్‌లో నిర్మాణాలను నిలిపి వేసే విధంగా మీరు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తామని, అదే సందర్భంలో ప్రెస్‌క్లబ్‌లోగతం నుంచి జరుగుతున్న కార్యకలాపాలకు అనుమతినివ్వాలని వారు కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు. ప్రెస్ క్లబ్‌లో జరిగే కార్యకలాపాలకు తాము అడ్డంకి కాదని కలెక్టర్ వారికి స్పష్టం చేశారు. వాటిని యధావిధిగా జరుపుకోవచ్చని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్కు యూనియన్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. గుర్తింపు పొందిన జర్నలిస్టు సంఘాలను ప్రెస్ క్లబ్ అడ్ హాక్ కమిటీలోకి తీసుకునే విధంగా ఆదేశాల ఇవ్వాలని వారు జిల్లా కలెక్టర్ ను కోరారు. దీనికి సంబంధించి డిసిఒ ను కలవాలని సూచిస్తూ, డిసిఒకు సిఫారసు చేశారు. ఆ తర్వాత డిసిఒను కలిసిన యూనియన్ నాయకులు ప్రెస్ క్లబ్ వ్యవహారాలను వివరించారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకూడదు అంటూ వచ్చిన సమాచారం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాంటి కార్యక్రమాలు ఏవి ప్రెస్ క్లబ్ చరిత్రలో జరగలేదని యూనియన్ నేతలు డీసీఓకు వివరించారు. ప్రెస్ క్లబ్ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకాలు లేవని, రోజు జరిగే వ్యవహారాలు యధావిధిగా జరుపుకోవచ్చని డి సి ఓ యూనియన్ నాయకులకు హామీ ఇచ్చారు. జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జాప్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్ రెడ్డి, బి మంజునాథ్ ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ ( ఏపీ ఎం ఎఫ్) మల్లికార్జున్ రావు స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్ ఆఫ్ ఏపీ సీనియర్ జర్నలిస్ట్ సి. రవికుమార్ వివిధ జర్నలిస్టుల సంఘం నాయకులు కలెక్టర్ కలిసినవారిలో ఉన్నారు



# అందరివాడు నరసాపురం తూమాటి ప్రసాద్...

### అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు తూమాటి ప్రసాద్‌కు ఘన సన్మానం.. మంత్రి పయ్యావుల కేశవ్, పయ్యావుల శ్రీనివాసులకు కృతజ్ఞతలు.. ప్రసాద్ మరిన్ని పదవులు అలంకరించాలి.. టీడీపీ నాయకులు...

**బెళుగుప్ప, డిసెంబర్ 29 :**
బెళుగుప్ప మండలంలో టీడీపీ పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తూ, ఓర్పు, సహనంతో, ఎన్నికల్లో టీడీపీ కు మెజార్టీ తెచ్చేందుకు శ్రమిస్తూ, నాయకుల్లోను, కార్యకర్తల్లోనూ, ప్రజల్లోనూ అందరివాడిగా ఉంటూ మంచి పేరు సంపాదించుకున్న నరసాపురం తూమాటి ప్రసాద్ కు టీడీపీ అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా ఎంపిక కావడం గర్వకారణమని టీడీపీ పలువురు నాయకులు పేర్కొన్నారు. సోమవారం బెళుగుప్ప మండలం పరిధిలోని నరసాపురం గ్రామంలో సీనియర్ నాయకులు తగ్గుపర్తి రాధాకృష్ణ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో టీడీపీ అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా నియమితులైన తూమాటి ప్రసాద్ ను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ టీడీపీ పార్టీ ఆవిర్భావం నుంచి ప్రసాద్ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఎన్నికల సమయాలలో ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుతంత్రాలు పన్నిన, టీడీపీ మెజార్టీని తీసుకొచ్చే విధంగా శ్రమించే వారన్నారు. 15 సంవత్సరాలుగా టీడీపీ మండల కన్వీనర్ గా ఉంటూ ప్రజలకు, పార్టీకు ఎన్నో సేవలు అందించారన్నారు. ప్రసాద్ సేవలను గుర్తించే రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా నేత పయ్యావుల శ్రీనివాసులు సహకారంతో జిల్లా ఉపాధ్యక్ష పదవి ని అలంకరించారన్నారు. ముఖ్యంగా మండలంలోని టిడిపి నాయకులు,కార్యకర్తలు ఇంకా కొద్ది నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని ఇప్పటి నుంచే ప్రతి కార్యకర్త, అందరం కలిసికట్టుగా ఉంటూ గ్రామాల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. వైయస్ఆర్ సీపీ నాయకులు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పయ్యావుల శ్రీనివాసుల సహకారంతో ఉరవకొండ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి దిశగా పయనిస్తుంటే అది చూసి ఓర్వలేక పయ్యావుల సోదరుల పై లేనిపోని నిందలు వేస్తూ బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలంతా టీడీపీ ని ఆదరిస్తున్నారన్నారు. ప్రసాద్ కు జిల్లా పార్లమెంటు ఉపాధ్యక్ష పదవి రావడం తో మండలంలో మిగిలి ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించుకొనేందుకు మంచి అవకాశం అన్నారు. రాబోవు రోజుల్లో ప్రసాద్ పార్టీలో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని మనసారా కోరారు.అనంతరం జిల్లా ఉపాధ్యక్ష పదవి చేపట్టిన తూమాటి ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని నాయకులు,కార్యకర్తలు, ప్రజలందరి సహకారంతో టీడీపీ పార్టీకి ఎనలేని సేవలను అందించానన్నారు. అది గుర్తించి పయ్యావుల సోదరుల సహకారంతో పార్టీ అధిష్టానం నాకు జిల్లా ఉపాధ్యక్ష పదవి వచ్చినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు రోజుల్లో కూడా మరింత బాధ్యతగా అందరి సమన్వయంతో పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సోదరులు జిల్లా నేత పయ్యావుల శ్రీనివాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ప్రసాద్ కు పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేయించి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తగ్గుపర్తి రాధాకృష్ణ, మల్లికార్జున, పెద్ద తిప్పయ్య, మాజీ వైస్ ఎంపీపీ దుద్దేకుంట తిమ్మప్ప, మురళి మోహన్, వెంకటాద్రి పల్లి సునీల్, అంకంపల్లి పవన్, నరేంద్ర చౌదరి, పురుషోత్తం నాయుడు, యర్రిగౌడ్, నారాయణస్వామి, త్రివేది నాయుడు, నరసాపురం గ్రామ కమిటీ అధ్యక్షులు చిన్న పల్లెప్ప, జయరాములు, వెంకటేశులు, గుండ్లపల్లి శివప్ప, నక్కలపల్లి వెంకటరామిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు


మాట్లాడుతున్న సన్మాన గ్రహీత, టీడీపీ అనంతపురం పార్లమెంటు ఉపాధ్యక్షులు తూమాటి ప్రసాద్


టీడీపీ అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన నరసాపురం తూమాటి ప్రసాద్‌ను సన్మానిస్తున్న వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు

# 48 గంటల్లోనే చోరీ కేసు ఛేదించిన పోలీసులు

### పది తులాల బంగారం, కేజీ వెండి స్వాధీనం .. కేసు దర్యాప్తులో సహకరించిన ఎస్ఐలకు ప్రశంసలు.. రూరల్ సీఐ వెంకటరమణ ..

**కనేకల్, డిసెంబర్ 29:**
కనేకల్లో ఈనెల 27వ తేదీన జరిగిన భారీ దొంగతనం కేసును కళ్యాణదుర్గం డీఎస్పి రవిబాబు ఆదేశాల మేరకు రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో బొమ్మన హాల్ ఎస్సై,కనేకల్ ఇంచార్జ్ నబి రసూల్, కనేకల్ ట్రైన్ ఎస్సై నారాయణ రెడ్డి సహకారంతో 48 గంటల్లో చేదించారు. ఈ సందర్భంగా సోమవారం రాయదుర్గం పిఎస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు సిఐ వెంకటరమణ మాట్లాడుతూ కనేకల్ పట్టణానికి చెందిన బంగారు వ్యాపారి లతీఫ్ అతని భార్య తభుసం ఇంటిలో దొంగతనం జరిగింది. వీరు ఈనెల 22వ తేదీ సాయంత్రం ఇంటికి తాళం వేసి బంధువులు చనిపోయిన కార్యక్రమానికి వజ్రకరూర్ వెళ్లారు అనంతరం సొంత పనులపై హైదరాబాద్ వెళ్లారు మరల ఈనెల 22వ తేదీన ఉదయం 9 గంటల సమయంలో కనేకల్ చేరుకున్నారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తమ ఇంటతాళం వెనుక భాగం వైపు వాకిలి పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించి బీరువా పగలగొట్టి అందులో ఉంచిన బంగారు ఆభరణాలు సుమారు పది తొలాల బంగారం ఒక కేజీ వెండి ఆభరణాలు మొత్తం విలువ 12 లక్షలు సొమ్ము దొంగలించారని గ్రహించిన తభుసం కనేకల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న కనేకల్ పోలీసులు కళ్యాణదుర్గం సబ్ డివిజనల్ డి.ఎస్.పి రవిబాబు ఆదేశాల మేరకు రూరల్ సిఐ వెంకటరమణ,కనేకల్ ఇన్చార్జి సిఐ నబి రసూల్,ట్రైని ఎస్సై నారాయణరెడ్డిలు రాత్రి పళ్ళు కష్టపడి ఈ కేసును 48 గంటల్లోనే చేదించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. సోమవారం తమకు రాబడిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఉదయం 11:30 గంటలకు కనేకల్ క్రాస్ వద్ద బళ్లారి రోడ్డు వద్ద నిందితుడు ఆఫ్గాన్ రజాక్ వలి (32) తండ్రి నజీర్ ను అరెస్టు చేసి తమ దైన శైలిలో విచారించడంతో సదరు నిందితుడు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారున్నారు.
మద్యం క్రికెట్ బెట్టింగ్ తదితర వ్యసనాలకు అలవాటు పడి అప్పులు చేశారన్నారు. అప్పులు తీర్చడానికి ఇతర వ్యసనాల కోసం తాళం వేసిన ఇళ్లలో దొంగతనం చేసి సులువుగా డబ్బులు సంపాదించాలని భావించాడు. ఈ క్రమంలోనే ఈనెల 22 తేదీ రాత్రి సమయంలో కనేకల్ టౌన్ లో ప్రభుత్వ ఆసుపత్రికి దగ్గరలో ఉన్న తాళం వేసిన ఇంటికి వెనక వైపు ఉన్న తలుపు ద్వారా నిందితుడు ఇంటిలోకి ప్రవేశించి ఇంట్లో బీరువాలో దాచిన విలువైన బంగారు, వెండి ఆభరణాలు దొంగతనం చేశారన్నారు. దొంగలించిన సొమ్మును తన తమ్ముడు ఇంటిలో పెట్టి సోమవారం బళ్లారికి తీసుకునిపోయి అమ్ముకోవడానికి బళ్లారి వెళుతుండగా పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేసి నిందితుడు నుండి దొంగలించిన మొత్తం బంగారు మరియు వెండి వస్తువులను స్వాధీనంలోకి తీసుకున్న మన్నారు. పది తులాల బంగారం ఒక కేజీ వెండి ఆభరణాలు మొత్తం కలిసి 12 లక్షల రూపాయలు విలువ ఉంటుందని అన్నారు. వారి దొంగతనం కేసు నమోదు చేసిన 48 గంటల్లో ముద్దాయిని కనిపెట్టి అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు సీఐ తెలిపారు. ఇకపై ఎవరైనా విలువైన వస్తువులు ఇంటిలో పెట్టి ఊరు వెళ్లకుండా వారితో తీసుకుని వెళ్లాలని లేదంటే తెలిసిన బంధువులు ఇంట్లో ఉంచాలని లేనిపక్షంలో బ్యాంక్ లాకర్లు భద్రపరిచి వెళ్లాలన్నారు. అది కుదరన్నపక్షంలో పోలీసులకు సమాచారం అందిస్తే తమ పద్ధతి ద్వారా వారి ఇంటికి మాత్రమే ఎవరికీ తెలియకుండా నిఘా తో ఆ ఇంటిని కనిపెట్టి దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కేసు చేదించడంలో ప్రధాన పాత్ర పోషించిన నబి రసూల్ నారాయణరెడ్డి లను సీఐ వెంకటరమణ ప్రత్యేకంగా అభినందించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ వెంకటరమణ



దొంగల నుండి రికవరీ చేసిన బంగారు వెండి నగలు

తెలుగోడు సినిమా
మంగళవారం
30 డిసెంబర్ 2025


# రాజాసాబ్‌పై భారీ అంచనాలు

ప్రీ ఈవెంట్‌లో ప్రభాస్ను పలకరించిన హియా

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన తాజా చిత్రం 'ది రాజా సాబ్' సంక్రాంతి కానుకగా జనవరి 9న థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొనగా, ఇటీవల గ్రాండ్‌గా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. 'బాహుబలి', 'సలార్', 'కల్కి' లాంటి భారీ పాన్ ఇండియా చిత్రాలతో ప్రభాస్ స్టార్‌డమ్ మరో స్థాయికి చేరిన సంగతి తెలిసిందే. అయితే ప్రభాస్‌లోని కామెడీ టైమింగ్‌ను వెండితెరపై చూసి చాలా కాలమే గడిచిపోయింది. చివరిసారిగా 'డార్లింగ్' చిత్రంలో ప్రభాస్ తన ఫన్ యాంగిల్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాడు. దాదాపు 15 ఏళ్ల తర్వాత, మళ్లీ అదే స్థాయిలో కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ప్రభాస్ కనిపించనున్నాడనే టాక్‌తో 'రాజా సాబ్'పై అంచనాలు భారీగా పెరిగాయి. పండగ సీజన్‌లో విడుదల కావడంతో ఈ సినిమా ఓ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా నిలవనుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇదిలా ఉండగా, 'రాజా సాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో జరిగిన ఓ ఆసక్తికర ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న మారుతి కుమార్తె హియా దాసరి, ఈవెంట్‌లో ప్రభాస్‌ను పలకరిస్తున్న వీడియో నెట్టింట హల్‌చల్ చేస్తోంది. ప్రభాస్ కూర్చుని ఉండగా వెనుక నుంచి వచ్చిన హియాను ఆయన ఎంతో ఆప్యాయంగా రిసీవ్ చేసుకుని మాట్లాడిన తీరు అభిమానుల మనసులను గెలుచుకుంది. ఈ మధురమైన క్షణాలను హియా స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ, 'హీరో గారు? మీరు నిజంగా ఎంతో మంచి వ్యక్తిత్వం ఉన్న మనిషి' అంటూ ఎమోషనల్ పోస్ట్ చేసింది. దీనిపై దర్శకుడు మారుతి కూడా లవ్ ఎమోజీలతో రియాక్ట్ అయ్యారు. అంతేకాదు, ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న నిధి అగర్వాల్ కూడా ఈ పోస్ట్‌పై స్పందించడం విశేషం. 'రాజా సాబ్' చిత్రంలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఫన్, రొమాన్స్, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం, ప్రభాస్ అభిమానులకు నిజమైన పండగ కానుక అవుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే? 'డార్లింగ్' తర్వాత ప్రభాస్ కామెడీ మ్యాజిక్‌ను 'రాజా సాబ్' ఎంత స్థాయిలో రిపీట్ చేస్తాడనేది చూడాలి.



# శ్రీవారిని దర్శించుకున్న ఛాంపియన్స్ టీం

తిరుమల శ్రీవారిని 'ఛాంపియన్' చిత్ర బృందం దర్శించుకుంది. సోమవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో సినిమా హీరో రోషన్, హీరోయిన్ అనస్వర రాజన్.. స్వామివారి సేవలో చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు.



# ప్రభాస్ మ్యాష్ అప్ వీడియో విడుదల



ప్రభాస్‌కు అంతర్జాతీయ స్థాయిలో అభిమానులు ఉన్న విషయం తెలిసిందే. ఆయన సినిమా వస్తుందంటే ఇండస్ట్రీలో సందడి నెలకొంటుంది. మరికొన్ని రోజుల్లో ఆయన 'ది రాజాసాబ్'తో పలకరించేందుకు సిద్ధమవుతున్నారు. దీని ప్రచారంలో భాగంగా చిత్రబృందం ఓ మ్యాష్‌అప్ వీడియో విడుదల చేసింది. ప్రభాస్ కెరీర్ ప్రారంభించినప్పటి నుంచి ఆయన సినిమాలు విడుదలైనప్పుడు అభిమానుల చేసే సందడి, ఇండస్ట్రీలో ఉన్న సినీ ప్రముఖులు ఆయన గురించి పంచుకున్న మాటలు ఆ వీడియోలో చూపించారు. గతంలో ప్రభాస్ అభిమానులను ఉద్దేశించి చెప్పిన కొన్ని మాటలు ఎమోషనల్‌గా ఉన్నాయి. తనకు ఒక్క అభిమాని ఉన్నా చాలు అనుకొని ఇండస్ట్రీకి వచ్చినట్లు ఆయన చెప్పారు.




# బడ్జెట్ పెరగడంతోనే టిక్కెట్ల రేట్లు పెరుగుదల

నిర్మాత నాగవంశీ వెల్లడి

సినిమా బడ్జెట్ ఆధారంగానే టికెట్ ధరలు పెంచుతున్నామని ఎవరినీ దోచేయడానికి కాదని నిర్మాత నాగవంశీ చెప్పారు. తాము బతికేదే ఇండస్ట్రీ మీద అని అలాంటప్పుడు టికెట్ ధరలు పెంచి ప్రేక్షకులు థియేటర్‌లకు రాకుండా ఎందుకు చేస్తామని అన్నారు. ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన టికెట్ ధరల గురించి ఆయన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇటీవల కొన్ని సినిమాలకు టికెట్ ధర రూ.99 నిర్ణయించారు. ఆ చిత్రాలు చిన్నవి కాబట్టి వాటికి ఆ ధర పెట్టినా కూడా బ్జడెట్‌కు సరిపడా ఓపెనింగ్స్ వచ్చేస్తాయి. అలాగే రూ.100కోట్లు, రూ.500కోట్లు ఖర్చుపెట్టి తీస్తున్నప్పుడు దాని ప్రకారం టికెట్ రేట్లు పెంచుతాం. అంత భారీ చిత్రాలకు కూడా రూ.99 ఉంటే సంవత్సరం ఆడితేగానీ రికవరీ అవ్వదు. ఇది సింపుల్ టాపిక్ దాన్ని చాలా పెద్దది చేసి మాట్లాడుతున్నారు. జనాలను దోచేయాలని నిర్మాతలెవరూ అనుకోరు. బ్జడెట్ ఎక్కువ ఉన్నవాటికి మాత్రమే ధరలు పెంచుతున్నామని అందరూ అర్థం చేసుకోవాలని అన్నారు.

సినిమా ప్రచారాల గురించి నాగవంశీ మాట్లాడుతూ.. 'సానుభూతి చూపిస్తే హిట్ అవుతుందనే అబద్ధం. అలాంటి జిమిక్కుల వల్ల ఒకటి, రెండు సినిమాలు హిట్ అవుతాయేమో కానీ ప్రతి దానికి అవి పనిచేయవు. ప్రచారంలో మాట్లాడిన మాటలు చూసి వచ్చేలా జనాలు లేరు. కథ బాగుంటే ప్రేక్షకులు ఎలాగైనా చూస్తారు. 'లిటిల్ హార్ట్స్' చిన్న చిత్రమే అయినా పెద్ద విజయం సాధించింది కదా.. ఒక మూవీని తొక్కేస్తున్నారు అనేది కూడా వాస్తవం కాదు. హిట్ చేయాలా లేదా అనేది పూర్తిగా ప్రేక్షకుల చేతుల్లోనే ఉంటుంది' అని నాగవంశీ చెప్పారు.

# రాజాసాబ్ మరో ట్రైలర్ విడుదల



రాజాసాబ్ నుంచి మరో ట్రైలర్ విడుదల
సంక్రాంతి సినిమాలు హిట్ కావాలన్న ప్రభాస్
ది రాజాసాబ్' విడుదలకు సమయం దగ్గరపడుతోంది. ఈ క్రమంలో చిత్ర బృందం ప్రచారాన్ని వేగవంతం చేస్తోంది. ఇప్పటికే పాటలు, ఓ ట్రైలర్‌ను రిలీజ్ చేసిన టీమ్ తాజాగా మరో ట్రైలర్‌ను విడుదల చేసింది. ప్రభాస్ హీరోగా మారుతి రూపొందించిన ఈ మూవీజనవరి 9న బాక్సాఫీసు ముందుకు రానున్న సంగతి తెలిసిందే. రొమాంటిక్ కామెడీ హారర్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లు.'పదిహేనేళ్ల తర్వాత మళ్లీ పూర్తిస్థాయి వినోదంతో 'ది రాజాసాబ్' చేశాం. ఈ సినిమా విషయంలో చాలా ఆత్రుతగా ఉన్నా. అది కూడా సంక్రాంతికి వస్తోంది. సంక్రాంతి సినిమాలన్నీ బ్లాక్‌బస్టర్ అవ్వాలి. మాది కూడా అయిపోతే మరింత సంతోషం అన్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా నటించిన 'ది రాజాసాబ్' విడుదలకు ముందస్తు వేడుక హైదరాబాద్‌లో జరిగింది. మారుతి దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధికుమార్ కథానాయికలు. సంజయ్‌దత్, జరీనా వహాబ్ ముఖ్యపాత్రలు పోషించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 9న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో సంజయ్‌దత్ కనిపించిన విధానం అద్భుతం. ఇది నానమ్మ మనవడి కథ. నానమ్మని చూస్తూ నా సన్నివేశాల్ని మరిచిపోయేవాణ్ని. అంతగా ఆ పాత్రలో ఒదిగిపోయారు జరీనా. ఇందులో నాతోపాటు మా నానమ్మకూడా ఓ హీరో. ముగ్గురు అందమైన హీరోయిన్లు ఇందులో ఉన్నారు. ఈ సినిమాకి అనుకున్న బడ్జెట్ ఒకటి, అయ్యింది మరొకటి. నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ దేనికీ వెనకాడకుండా సినిమాని పూర్తి చేశారు. ఆయన నిజమైన హీరో ఈ సినిమాకు. ఇలాంటి సినిమాకి ఆ స్థాయిలో రీరికార్డింగ్ చేసే సంగీత దర్శకుడు తమన్ ఒక్కరే అనిపించింది. మారుతి మూడేళ్ల కష్టం, బాధ్యత ఈ సినిమా. సంక్రాంతికి చాలా సినిమాలొస్తున్నాయి. ఎప్పటికైనా సీనియర్లు సీనియర్లే. వాళ్ల నుంచే మేం నేర్చుకున్నాం' అన్నారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ 'కథానాయకుడు ప్రభాస్, నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ కారణంగానే ఈ సినిమాతో ఇంత దూరం ప్రయాణించాం. నిర్మాత జీవితాన్ని పెట్టారు ఈ సినిమాకి. థియేటర్‌కి వచ్చినవాళ్లకు మేం ఎంత కష్టపడ్డామో కనిపిస్తుంది. రాజమౌళికి ప్రతి దర్శకుడు చాలా రుణపడి ఉంటారు. పాన్ ఇండియా స్థాయిలో ఎంతోమందికి గుర్తింపు దక్కిందంటే కారణం ఆయనే. నిజంగా ఇది తెలుగు చిత్ర పరిశ్రమకు స్వర్ణయుగం. నా స్థాయిలో నేను సినిమాలు చేస్తుంటే, నువ్వు ఇంకా పైకి ఎదగాలి అంటూ ఈ అవకాశం ఇచ్చారు ప్రభాస్. ఆయన నటించి వెళ్లడం కాకుండా ఈ సినిమాకోసం జీవితాన్ని పెట్టారు. అన్ని భాషల్లోనూ ఈ సినిమా ప్రేక్షకుల్ని అలరిస్తుంది. ఈ కథలో అంత శక్తి ఉంది. ఈ సినిమాలో ప్రభాస్ నటనను ఒక ప్రేక్షకుడిగా చూస్తూ నాకే కన్నీళ్లొచ్చాయి' అంటూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రభాస్ వేదికనెక్కి ఓదార్చిన అనంతరం మళ్లీ మారుతి మాట్లాడుతూ ఈ సినిమా ప్రేక్షకుల్ని ఒక్క శాతం కూడా నిరుత్సాహపరచదని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటి జరీనా వహాబ్, టి.జి.విశ్వప్రసాద్, అనిల్ తడాని, తమన్, నవీన్ ఎర్నేని, కృతిప్రసాద్, మహేశ్ ఆచంట తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకకి ప్రధాన ఆకర్షణ ప్రభాస్ హెయిర్ స్టైలే. ఆయన పిలకతో ఈ వేడుకకు హాజరయ్యారు. 'స్పిరిట్' కోసం ఆ గెటప్‌లో సిద్ధమయ్యారు. వేడుకలో అభిమానుల్ని ఉద్దేశించి ఉత్సాహంగా మాట్లాడారు. ఏదో ఒక రోజు అందరూ షాక్ అయ్యేలా వేదికపై వినోదం పంచుతానని ఆయన చెప్పడంతో అభిమానులంతా కేరింతలు కొట్టారు. వేడుకలో ప్రభాస్ పెళ్లి చేసుకునే అమ్మాయికి ఎలాంటి క్వాలిటీస్ ఉండాలి అంటూ ఓ అభిమాని ప్లకార్డు ప్రదర్శించారు. 'అది తెలియకే ఇంకా పెళ్లిచేసుకోలేదు' అంటూ ఫన్నీగా సమాధానమిచ్చారు ప్రభాస్.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD .. PRGI No- APTEL/25/A2739, Cell- 9963496956, 7382712780.